అమృతవాహిని

పంచమలహరి

37
29174

శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య
శ్రీ శ్రీ శ్రీ సీతారామయతీంద్రులు
ముముక్షుజన మహాపీఠాధిపతులు

PLACED ON THE SHELF
Date..

ద్వితీయ ముద్రణము
వేయి ప్రతులు

సర్వస్వామ్యములు
ప్రకాశకులవి.

సంపాదకులు :

శ్రీ పాపతల్లి
ముత్తేవి సీతారాం

వెల: ఆరు రూపాయలు

ప్రతులకు :
కార్యదర్శి
శ్రీ యతీంద్ర ప్రచురణలు
గంజాంవారివీధి – కాకినాడ

మే
1982

"ముముక్షువు"
పవరుపేట
ఏలూరు.

SRI VENKATESWARA
CENTRAL LIBRARY &
RESEARCH CENTRE,
Acc. No ....
Date ....
TIRUPATI.

THIS BOOK IS PUBLISHED WITH THE FINANCIAL ASSISTANCE OF TIRUMALA TIRUPATI DEVA-STHANAMS UNDER THE1R SCHEME "AIDTO PUBLISH RELIGIOUS BOOKS."

పీ ఠి క

అర్జునుని నిమిత్తమాత్రముగ చేసికొని, గీతారూప ముగ సార్వకాలికము, సార్వజనీనము అయిన మహాప్రబోధ మును చేసినాడు శ్రీకృష్ణపరమాత్మ.

కరుణ దివ్యమైనది. ప్రతివ్యక్తియును కరుణతో నిండి తొణికిసలాడు హృదయము కలిగియుండవలెను. మోహము క్షుద్రమైనది. ఏ స్థితిలోను మోహమును దరిచేరనీయరాదు. కరుణ, మోహము రెండును సామాన్యదృష్టికి ఒకేవిధముగ భాసించును. అందుచే ఈ సందర్భమున అప్రమత్తత ఎంతయో అవసరము. మోహమును కరుణగా భావించి పెంచుకొనుట గాని, కరుణను మోహముగా భావించి త్రుంచుకొనుటగాని చేయరాదు. ఇందు మొదటి తప్పు జరిగినది అర్జునునివలన.

అర్జునుని ఆ వ్యామోహమును నిర్మూలించుటకు ద్వితీయాధ్యాయమున ఆత్మానాత్మ వివేకమునుగూర్చి ప్రబో ధించినాడు పరమాత్మ.

అప్పటి ప్రజలలో కర్మ బంధనకారణము అన్న భ్రమాత్మకమైన ప్రతీతి బాగుగ వ్యాపించియుండుటచే, కర్మ బంధనకారణము కాదనియును, మోక్షమునకు ప్రతిబంధకము కాదనియును, నిజమైన బంధనకారణము మనస్సే - భావమే - అనియును ప్రతిపాదింపబడుచు, ఎట్టిభావముతో కర్మ చేయ

వలయునో, ఎట్టి భావముతో చేసిన ప్రతిబంధకము కాకపోవుటే గాక, మీదుమిక్కిలి భగవత్ప్రాప్తిరూపమైన మహాఫలమునకు - మోక్షమునకు - సాధనమగునో ఆ విధానమును - సమత్వబుద్ధియోగమును - మూడవ అధ్యాయములో నిరూపించినాడు పరమాత్మ.

ఇక 'గుహ్యతమము' అని, నాలుగవ అధ్యాయమున తన అవతార స్వరూప గుణవైభవాదులను వివరించి ప్రవచించినాడు పరమాత్మ.

అంతవరకు వినిన అర్జునునకు ఒక సందేహము కలిగినది- కృష్ణపరమాత్మ కర్మయోగమును బోధించుచున్నాడా, కర్మసన్న్యాసమును బోధించుచున్నాడా అని. కర్మసన్న్యాసమును పొగడుచు బోధించుచున్నట్లు ఒకమారును, కర్మయోగమునే పొగడుచు బోధించుచున్నట్లు ఒకమారును అనిపించుచున్నది. ఈ రెంటిలో తనకు తగినది ఏది ? కర్తవ్యమేది ? - ఇది అర్జునుని సంశయము.

నిజమునకు లోకములో అనాదిగ కర్మసన్న్యాస కర్మమార్గములు రెండును వ్యాప్తియందున్నవి. గీతాప్రబోధకాలమునకు కర్మసన్న్యాసమార్గముకూడ బహుళప్రచారమున ఉండియుండవచ్చును. అందుచేతనే అర్జునుడు కర్మను విరోధించుచు, ఘోరహింసారూపమైన ఈ కర్మమార్గమును విడిచి, భిక్షాన్నముతో క్షున్నివారణ చేసుకొనుచు ఏ జంజాటమునులేక, శాంతముగ ఏ కొండగుహాలోనో

ఉన్న యెడల సుఖమును, జన్మరాహిత్యమును పొందవచ్చును అని భ్రమించి, వాదించుటకు ఆరంభించినాడు.

స్వధర్మమైన ధర్మయుద్ధమునందు విముఖత, పరధర్మమైన భిక్షాటనమునందు సుముఖత కలిగియున్న అర్జునుడు పరమాత్మ బోధనలోని యాథార్థ్యమును సరిగ గ్రహింపలేక, తికమకపడి, కృష్ణపరమాత్మ బోధకే స్వవచోవ్యాఘాత దోషమును అంటగట్టుచున్నాడు.

ఆతని భ్రమాత్మకమైన ఆ భావమునకు నవ్వుకొనుచు పరమాత్మ కర్మసన్న్యాసమును, కర్మయోగమును - రెండును మోక్షదాయకములే అనియు, అయినను కర్మసన్న్యాసము కంటె, కర్మయోగము శ్రేష్ఠమైనది అనియు ప్రతిపాదించి, నిరూపించినాడు. ఈ అయిదవ అధ్యాయమున ఈ విషయమే ప్రధానముగా చర్చింపబడి, నిరూపింపబడినది.

అవధానము ఏ మాత్రము కొరవడినను - అర్జుననంతవాడు తికమకపడిన ఈ సందర్భము అవగతమగుట కష్టమేగదా! పాఠకులు సావధానచిత్తులరై చిత్తగింతురు గాక!

— సీతారామయతి.



ఓం శ్రియఃపతయేనమః
ఓం శ్రీ పరమాత్మనేనమః

శ్రీమద్భగవద్గీతా - పంచమోఽధ్యాయః

కర్మ సన్న్యాసయోగః

అర్జున ఉవాచ :-

శ్లో॥ సన్న్యాసం కర్మణాం కృష్ణ !
పున ర్యోగం చ శంససి
య చ్ఛ్రేయ ఏతయో రేకం
త న్మే బ్రూహి సునిశ్చితమ్॥

ప. వి :- సన్న్యాసం, కర్మణాం, కృష్ణ, పునః, యోగం, చ, శంససి, యత్, శ్రేయః, ఏతయోః, ఏకం తత్, మే, బ్రూహి, సునిశ్చితమ్

టీక :—

కృష్ణ = ఓ కృష్ణా !
కర్మణాం సన్న్యాసం = కర్మసన్న్యాసమును,
పునః = మరల,
యోగంచ = కర్మయోగమును,
శంససి = పొగడుచున్నావు,
ఏతయోః = ఈ రెంటిలో,

యత్ = ఏది,
శ్రేయః = శ్రేయస్కరమైనదిగా,
సునిశ్చితమ్ - బాగుగా నిశ్చయింపబడినదో,
తత్ = దానిని,
మే = నాకు,
బ్రూహి = చెప్పుము.

తా. అర్జునుడు అడుగుచున్నాడు - కృష్ణా ! నీవు కర్మసన్న్యాసము, కర్మయోగమును కూడ ప్రశంసించుచున్నావు. ఈ రెంటిలో ఏ ఒక్కదానిచే నాకు శ్రేయస్సు నిశ్చితమై యున్నదో దానిని చెప్పుము.

అ మృ త వా హి ని :-

కృష్ణా ! కొంతసేపు కర్మసన్న్యాసమును పొగడుచున్నావు. మరల కొంతసేపు కర్మయోగమును పొగడుచున్నావు. ఈ రెంటిలో ఏది ఆచరణలో పెట్టవలయును ? పోనీ, ఈ రెండును ఆచరణములో పెట్టుకొందమనిన రెండును పరస్పర విరుద్ధములుగదా ! అట్టి ఈ రెంటిని ఎవ్వరైనను ఒకే కాలమునందు ఎట్లు ఆచరణలో పెట్టుకొనగలడు ? ఏదో ఒకటియే ఆచరించవలయును. దానిని నేను ఆలోచించి నిర్ణయించుకొనలేను. కనుక నీవే ఈ రెంటిలో ఏది శ్రేయస్కరమో దానిని నిర్ణయించి చెప్పుము అని అడిగినాడు అర్జునుడు.

కృష్ణపరమాత్మ నాల్గవ అధ్యాయములో "కర్మ ణ్యకర్మ యః పశ్యేత్" 'ఎవడు కర్మయందు అకర్మను చూచునో' (4-18) అనియును, "జ్ఞానాగ్నిదగ్ధ కర్మాణం" 'ఎవని కర్మలు జ్ఞానము అనెడి అగ్నిచేత దగ్ధము చేయబడినవో' (4-19) అనియును, "బ్రహ్మార్పణం బ్రహ్మహవి ర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతం, బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా" 'బ్రహ్మమే అర్పణము, బ్రహ్మమే హవిస్సు, బ్రహ్మమే అగ్ని, కర్తయును బ్రహ్మమే - ఈ విధముగ సర్వత్ర బ్రహ్మభావన కలిగియున్న వానిచేత పొందబడునది బ్రహ్మమే' (4-24) అనియును, "శ్రేయాన్ ద్రవ్యమయా ద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప! సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే" 'ఓ పరంతపా! ద్రవ్యమయమైన యజ్ఞముకంటె జ్ఞానయజ్ఞము శ్రేష్ఠము. ఓ పార్థా! అన్నిరకములైన కర్మలును జ్ఞానమునందే పర్యవసించుచున్నవి' (4-౩౩) అనియును, "జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్ కురుతే తథా" 'జ్ఞానము అనబడు అగ్ని సర్వకర్మలను భస్మము చేయుచున్నది' (4-౩7) అనియును చెప్పిన చోటులనెల్ల జ్ఞానమే పొగడబడినది అని అర్జునుడు తలచినాడు. ఇంతయును ఇట్లు చెప్పి చివరకు "తస్మా దజ్ఞాన సంభూతం హృత్స్థం జ్ఞానాసి నాత్మనః । ఛిత్త్వైనం సంశయం యోగ మాతిష్ఠోత్తిష్ఠ భారత" 'కనుక, అర్జునా! నీ హృదయమందున్న అజ్ఞానమూలకమైన ఈ సంశయమును జ్ఞానము అను ఖడ్గముతో తెగనరికి, యోగమును ఆశ్రయింపుము' అని

కర్మయోగమునే ఆచరించవలసినదిగ, యుద్ధము చేయవలసినదిగ చెప్పినాడు. ఇంతవరకు అర్జునునకు బోధింపబడిన గీతలో "ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః" 'ఈ విధముగ తెలిసికొని పూర్వకాలములోని ముముక్షువులు కూడ కర్మ చేసిరి' (4-15) అనియును, మూడవ అధ్యాయ ప్రారంభములో అర్జునుడు "జ్యాయసీ చేత్కర్మణస్తే మతా బుద్ధిర్జనార్దన ! తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ !" "వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే । తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోఽహమాప్నుయామ్" 'ఓ జనార్దనా ! కర్మ కంటె బుద్ధి - జ్ఞానము - శ్రేష్ఠము అని నీ మతమైనచో, కేశవా ! నన్నెందుకు ఈ ఘోరమైన కర్మయందు నియోగించుచున్నావు ? కలగలుపుగా నున్న నీ వాక్యములతో నా బుద్ధిని భ్రమపెట్టుచున్నట్లున్నావు. నాకు శ్రేయస్సు లభింపజేయు ఒకే ఒక్క అంశమును నిశ్చయించి చెప్పుము' అని ప్రశ్న వేసిన తరువాత కూడ కృష్ణపరమాత్మ "యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతేఽర్జున ! కర్మేంద్రియైః కర్మయోగమసక్తస్స విశిష్యతే" 'అర్జునా ! ఎవడు మనస్సుతో ఇంద్రియములను నిగ్రహించి, ఆసక్తిలేక కర్మేంద్రియములచేత కర్మయోగము ఆచరించునో వాడు శ్రేష్ఠుడు' (3-7) అనియును, "నియతం కురు కర్మ త్వం కర్మ జ్యాయో హ్యకర్మణః" 'శాస్త్ర విహితమైన కర్తవ్య కర్మను చేయుము. కర్మ చేయకుండుట కంటె

కర్మ చేయుటయే శ్రేష్ఠము' (3-8) అనియును, "యజ్ఞశిష్టాశిన స్సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః" 'యజ్ఞమునందు భగవదర్పణము చేసి మిగిలిన అమృతము అనెడి అన్నమును భుజించెడి సత్పురుషులు సమస్త పాపముల నుండియును విడువబడుచున్నారు' (3-13) అనియును, "తస్మా దసక్త స్సతతం కార్యం కర్మ సమాచర ! అసక్తో హ్యాచర న్కర్మ పర మాప్నోతి పూరుషః" 'కాబట్టి, ఆసక్తి లేనివాడవై కర్తవ్య కర్మను చేయుము. ఆసక్తిలేక కర్మములు చేయుచున్న మానవుడు పరమపదమును పొందుచున్నాడు' (3-19) అనియును, "కర్మణైవహి సంసిద్ధి మాస్థితా జనకాదయః" 'జనకుడు మొదలగు జ్ఞానులందరును నిష్కామకర్మ చేతనే గదా పరమపదమును పొందిరి' (3-20) అనియును, "న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు" 'ఓ అర్జునా ! నాకు కర్తవ్యము ఏమియును లేదు. మూడు లోకములలో కూడ నాకు పొందవలసినది ఏదియును లేదు. అనగా అన్నియును నా అధీనములోనే ఉన్నవి. అయినను ఇట్టి నేను కూడ కర్మను చేయుచున్నాను' (3-22) అనియును, "సక్తాః కర్మ ణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత! కుర్యా ద్విద్వాం స్తథా సక్త శ్చికీర్షు ర్లోకసంగ్రహమ్" 'కావున, ఓ అర్జునా! అజ్ఞానులైన ప్రజలు ఆసక్తితో-ఫలాపేక్షతో-కర్మలు చేయుచున్నట్లు జ్ఞాని కూడ ఆసక్తిలేనివాడై, లోకసంగ్రహము కొరకు కర్మ చేయవలయును' (3-25) అనియును కర్మయోగమును

పొగడినాడు. ఇక ఆ మూడవ అధ్యాయములోనే "యస్త్వాత్మ రతి రేవ స్యా దాత్మ తృప్తశ్చ మానవః। ఆత్మ న్యేవ చ సంతుష్ట స్తస్య కార్యం న విద్యతే" "నైవ తస్య కృతేనార్థో నాకృ తే నేహ కశ్చన। న చాస్య సర్వభూతేషు కశ్చి దర్థ వ్యపాశ్రయః" (3-17,18) 'ఆత్మయందే రతుడును, ఆత్మయందే తృప్తుడును, ఆత్మయందే సంతుష్టుడును అగు వానికి చేయదగిన కర్మ - చేయవలసిన కర్మ-ఏదియునులేదు. అతనికి ఈ లోకము నందు కర్మ చేయుటచేతగాని, చేయకపోవుట చేతగాని ఎంతమాత్రమును లాభనష్టములులేవు. అతనికి పిపీలికాది బ్రహ్మపర్యంతమైన సకల భూతములందును, ఆశ్రయించి సంపాదించవలసిన స్వార్థము ఈషన్మాత్రము కూడ లేదు' అని యును జ్ఞానమును పొగడినాడు. ఈ కారణముచేత అర్జునుడు ఏదియును నిశ్చయించుకొనలేక తబ్బిబ్బు చెందినాడు.

మూడవ అధ్యాయము మొదట అర్జునుడు కర్మను, జ్ఞానమును కూడ పొగడియుండుటచేత ఆ కలగలుపు మాట లతో భ్రమ చెంది, "వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయ సీవ మే" 'కలగలుపు మాటలతో నా బుద్ధిని భ్రమింప జేయుచున్నట్లున్నావు' అని చెప్పికొంటినే, తరువాత మరల ఇట్లు రెంటిని పొగడుచున్నాడే అని కొంచెము తబ్బిబ్బుచెందినవాడై, "నాకేమియును తెలియదు. ఈ రెంటిలో ఏది శ్రేయస్కరమైనదో అది నీవే నిశ్చయించి చెప్పుము" అని కోరినాడు.

నిజమునకు అర్జునునికి కృష్ణపరమాత్మ కర్తవ్యమును నిరూపించి, ఆజ్ఞాపించియేయున్నాడు. బాగుగా కలతచెంది యుండుటచే గ్రహించలేకుండ ఉన్నాడు అర్జునుడు. "తస్మా ద్యుధ్యస్వ భారత" (2-18) 'కాబట్టి, అర్జునా! యుద్ధము చేయుము' అనియును, "తస్మా దుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృతనిశ్చయః" (2-37) 'కనుక' అర్జునా! యుద్ధము చేయుటకే కృతనిశ్చయుడవై లెమ్ము' అనియును, "తదర్థం కర్మ కౌంతేయ! ముక్తసంగ స్సమాచర" (3-9) 'అర్జునా! యజ్ఞము కొరకు ఆసక్తిరహితుడవై కర్మచేయుము' అనియును, "నియతం కురు కర్మ త్వం" (3-8) 'నియమితకర్మ చేయుము' అనియును, "తస్మా దసక్త స్సతతం కార్యం కర్మ సమాచర" (3-19) 'కాబట్టి, ఎల్లప్పుడును ఆసక్తిరహితుడవై కర్తవ్యమైన కర్మను బాగుగ ఆచరించుము' అనియును, "నిరాశీ ర్నిర్మమో భూత్వా యుద్ధ్యస్వ విగతజ్వరః" (3-30) 'ఫలాపేక్ష లేక, మమకార రహితుడవై, వ్యసనము లేనివాడవై యుద్ధముచేయుము' అనియును, "కురు కర్మైవ తస్మా త్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్" (4-15) 'కాబట్టి నీవు కూడ పూర్వులచేత చేయబడి నట్టిదియును, బహుపురాతనమైనట్టిదియును అగు కర్మనే చేయుము' అనియును, "తస్మా దజ్ఞానసంభూతం హృత్స్థం జ్ఞానాసి నాత్మనః ॥ ఛిత్త్వైనం సంశయం యోగ మాతిష్ఠో త్తిష్ఠ భారత" (4-42) 'కాబట్టి ఓ అర్జునా! నీ హృదయమం దున్నదియును, అజ్ఞానమువలన పుట్టినదియును అగు ఈసంశయ

మును, జ్ఞానమనెడి ఖడ్గముతో నరికివేసి, కర్మయోగమును ఆచరింపుము. లెమ్ము!' అనియును, ఇంతవరకు ఆరుచోట్ల 'నీవు కర్మయోగమునే-యుద్ధమునే-చేయుము' అని వాచ్యముగ విధించినాడు. అయినను చిత్తము బాగుగ కలతచెందియుండుట చేత అదే మరల మరల అడుగుచున్నాడు అర్జునుడు.

అవతారిక:-

అర్జునుడు అడిగిన ప్రశ్నకు సమాధానము చెప్పుచు కృష్ణపరమాత్మ ఈ రెండవ శ్లోకము ప్రారంభించినాడు.

శ్రీ భగవానువాచ :-

శ్లో॥ సన్న్యాసః కర్మయోగశ్చ
నిశ్శ్రేయసకరా వుభౌ
తయోస్తు కర్మసన్న్యాసాత్
కర్మయోగో విశిష్యతే॥ ౨

ప. వి :-సన్న్యాసః, కర్మయోగః, చ, నిశ్శ్రేయసకరౌ, ఉభౌ, తయోః, తు, కర్మసన్న్యాసాత్, కర్మయోగః, విశిష్యతే.

టీక :-

సన్న్యాసః = కర్మసన్న్యాసమును,
కర్మయోగశ్చ = కర్మయోగమును,
ఉభౌ = అను నీరెండును,

నిశ్శ్రేయసకరౌ = మోక్షమును కలుగజేయునవే.
(తథాపి = అయినను)
తయోస్తు = రెండింటిలోను,
కర్మసన్న్యాసాత్ = కర్మసన్న్యాసముకంటె,
కర్మయోగః = కర్మయోగము,
విశిష్యతే = శ్రేష్ఠమైనది.

తా. శ్రీ భగవంతుడు చెప్పుచున్నాడు - కర్మసన్న్యాసము, కర్మయోగము రెండును కూడ మోక్షదాయకములే. ఆ రెంటిలో కర్మసన్న్యాసము కంటె కర్మయోగమే శ్రేష్ఠమైనది.

అమృతవాహిని:-

ఈ శ్లోకములో కృష్ణపరమాత్మ బాగుగ స్పష్టయించి నిశ్చయించి చెప్పుచున్నాడు. సమాధానము రెండు భాగములుగ ఉన్నది. ఒకటి - కర్మసన్న్యాసము, కర్మయోగమును కూడ మోక్షము నిచ్చునవియే అని ముందు సమాధానము. మానవకల్పితములైన మార్గములైనచో అవి మోక్షమును కలుగజేయగలవా లేదా అను సందేహము సహజము. ఏల యనగా - "మమ మాయా దురత్యయా" అని చెప్పబడిన భగవన్మాయను ఎవడును అతిక్రమించలేడు గదా! కనుక బ్రహ్మాదిదేవతలు సైతము మాయకు లోబడినవారే. వారి బుద్ధియును భ్రమప్రమాదములు అను దోషములు కలదే.

అందుచేత వారు స్వతంత్రముగ ఏది ఆలోచించినను వారి ఆలోచనలచేత తేలిన సిద్ధాంతములు సరియైనవి కావచ్చును; కాకపోవచ్చును. కాని, ఈ రెండు మార్గములును భగవంతుడు ఏర్పాటు చేసినవే. మూడవ అధ్యాయములో మూడవ శ్లోకములో "లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ!" 'ఓ అర్జునా! పూర్వమునందు జ్ఞానయోగము - కర్మసన్న్యాసము - కర్మయోగము అను ఈ రెండు నిష్ఠలును - మార్గములును - నాచేతనే చెప్పబడినవి' అని భగవానుడే స్వయముగ చెప్పియున్నాడు. అందువలననే ఈ రెండు మార్గములును మోక్షదాయకములే అని భగవానుడు ఇక్కడ చెప్పుట.

ఇక రెండవదానిలో - అయినను, ఈ రెండు మార్గములలో కర్మసన్న్యాసముకంటె కర్మయోగమే మిక్కిలి శ్రేష్ఠమైనది అని చెప్పియున్నాడు. ఈ విషయము చాల జాగ్రత్తగ పరిశీలించవలసియున్నది.

మానవుడేమి చేయవలయును ?

తరించుటకై జీవునకు భగవంతునిచేత ఈ మానవదేహము ప్రసాదింపబడినది. ఒక్క మానవదేహము తప్ప ఇంక ఏ దేహమును తరించుటకు ఉపయోగించునది కాదు. అందుచేతనే ఈ మానవదేహమును గూర్చి శాస్త్రములలో "మోక్షద్వారం సుదుర్లభం" అని చెప్పబడియున్నది. అనగా

జీవుడు మోక్షము పొందవలెనన్నచో, మానవ దేహము ద్వారానే పొందవలయును. మోక్షద్వారమైనమానవదేహము 'సుదుర్లభం' - దొరకుట చాలకష్టము. ఒక్క భగవంతుని అనుగ్రహమువలన లభించవలసినదే. ఎట్లో అట్లు దొరకినది - ఇది జలబుద్బుద సమానము. క్షణభంగురము. ఇట్టి ఈ మానవ దేహమును భగవదనుగ్రహముచేత పొందికూడ ఈ దేహము పడిపోవులోపల దీనిచేత పొందవలసిన ప్రయోజనము పొందక పోయినయెడల అంతకంటె తెలివితక్కువతనమేముండును ? కనుక ఈ మానవదేహము లభించినందుకు మోక్షమునకే ప్రయత్నించవలయును. అయితే మోక్షమునకెట్లు ప్రయత్నించ వలయును ? మార్గమేది ? భగవంతుడు "ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ" 'పూర్వమే నాచేత రెండు మార్గములు చెప్పబడినవి' అని చెప్పియున్నాడు. అవియే జ్ఞానయోగము, కర్మయోగము. జ్ఞానయోగమనినను, సాంఖ్యయోగమనినను, కర్మసన్న్యాసయోగ మనినను పర్యాయపదములుగనే భగ వానుడు ప్రయోగించియున్నాడు. కర్మయనియు, యోగ మనియును, కర్మయోగ మనియును, కర్మయోగమును గురించి ప్రయోగించియున్నాడు. కనుక కర్మసన్న్యాసము, కర్మ యోగముకూడ మోక్షదాయకములే అని చెప్పియుండుటచే, మోక్షమును కోరువారు ఈ రెండు మార్గములలో దేనినైనను స్వీకరించవచ్చును. కాని కృష్ణపరమాత్మ అభిప్రాయము ప్రకా రము ఈ రెంటిలో కర్మయోగమే మిక్కిలి శ్రేష్ఠమైనది,

ఈ రెండును మోక్షదాయకములే అయినప్పుడు 'అందులో ఒకటి శ్రేష్ఠము' అని ఎందులకనవలయును ?

మానవులు రెండు రకములైన వారుందురు. ఒకరకపు వారు ఇతరులకు అపకారము చేయరు. ఉపకారమును చేయరు. వారిహితమేదో వారు చూచుకొనుచుపోదురు. ఇంకొక రక మైనవారు తమ హితమును చూచుకొనుచు, తమకు వీలున్నంత వరకు, చేతనైనంతవరకు అవకాశమును ఏమాత్రమును జార విడుచుకొనకుండ ఇతరుల హితముకొరకు కూడ పాటుపడు చుందురు. మొదటి తరగతి వారికి కర్మసన్న్యాసమును రెండవ తరగతి వారికి కర్మయోగమును సరిపడును.

కొంతమందికి కర్మ బంధనకారణమని బాగుగా అభి ప్రాయ మేర్పడియున్నది. కర్మయే కేవలము బంధనమైన, మోక్షప్రాప్తికి సంబంధించిన సాధనయే కర్మసన్న్యాసముతో ప్రారంభము కావలసి వచ్చును. ఒకదశలోమాత్రము కర్మలు చేయుట ఎట్లు పొసగును ? శంకర, రామానుజ, మధ్వాది మత ప్రవర్తకులందరును కూడ అంతఃకరణ శుద్ధికొరకు నిష్కామ్యముగా కర్మలు చేయవలయుననియే విధించి యున్నారు. కర్మయే బంధనకారణమైన కామ్యముగా చేసి నను, నిష్కామ్యముగా చేసిన బంధించియే తీరవలయును. కాని అట్లులేదు. నిష్కామముగా చేసిన కర్మ అంతఃకరణము నందలి మలినమును, దోషములను పోగొట్టి పరిశుద్ధి చేయునని చెప్పి

యున్నారు. దీనినిబట్టి ఆలోచించిన బంధమోక్షములకు కారణము భావముగాని కర్మకాదు. అందువలననే "నైవతస్య కృతేనార్థో నాకృతే నేహకశ్చన" (3-18) అనినట్లు అట్టి మహాత్ములకు కర్మ చేయుటచేతగాని, చేయకపోవుటచేత గాని, కలుగు లాభనష్టములు ఎంతమాత్రమును ఉండవు. కనుక అట్టివారు కర్మచేసినను, చేయకపోయినను ఒకటే. అయినప్పుడు వారు కర్మచేసినచో ఆకర్మచేత లోకమునకు మేలుకలుగు సందర్భములో వారు ఎందుకు చేయరాదు ? చేసి నందువలన వారికి నష్టములేదాయె; లోకమునకు మేలాయె; అట్టిసందర్భములో దయార్ద్రహృదయులైన మహాత్ములు తమకు లాభము లేనంతమాత్రమున, తాము కర్మచేసిన లోకమునకు హితము కలుగుచుండగా, కర్మచేసినను, చేయక పోయినను తమకు లాభనష్టములు లేవు గనుక ఇతరుల మేలు కొరకు తామెందుకు చేయవలయునని కర్మచేయక ఊరకుండ గలరా ? అది వారికి చేతనౌనా ? అందుకనియే దయామయు డైన కృష్ణపరమాత్మ "నమేపార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన। నానవాప్త మవాప్తవ్యం వర్తఏవచ కర్మణి" 'అర్జునా! నాకు కర్మచేయవలసిన ఆవశ్యకము ఎంతమాత్రమునులేదు. మూడులోకములలో నాది కానిది ఏదియునులేదు. కాబట్టి నాకు ఇది కావలయును అను కోరికయేలేదు. అయినను నేను కూడ కర్మచేయుచునే యున్నాను' అని చెప్పియున్నాడుగదా! కారణముకూడ తెలిపియున్నాడు. "యద్య దాచరతి శ్రేష్

స్తత్తదేవేతరో జనః । స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే” ‘పరమార్థానుభవముగల మహాత్ములు దేనిని చేయుదురో ఇతర జనులు సైతము దానినే చేయుదురు. ఆ మహాత్ముడు దేనిని ప్రమాణముగా గొనునో దానినే లోకులు అనుసరింతురు’ అనిచెప్పి, దానికి ఉదాహరణముగ తనను చెప్పికొనినాడు. కనుక మానవుడు ఏది చేసినను కేవలము తనకొరకనే చేయరాదు. ఏదియైనను కేవలము తనకొరకనే చేయువానిని గూర్చియే భగవంతుడు మూడవ అధ్యాయము లోని పదమూడవ శ్లోకములో “భుంజతే తే త్వఘం పాపా యే పచం త్యాత్మ కారణాత్” అని చెప్పియున్నాడు. అనగా ‘ఏ పాపాత్ములు కేవలము తనకొరకే అన్నము వండుకొను చున్నారో, వారు పాపమునే భుజించుచున్నారు. అన్నమును కాదు.’ ఇక్కడ అన్నము ఉపలక్షణముగా మానవుడు చేయు సమస్త కర్మలను గురించి ఉద్దేశించి చెప్పబడినది. మానవుడు ఏపని చేసినను తనకొరకును, లోకము కొరకును కూడ అయి ఉండవలయును. అంతియేగాని కేవలము తనకొరకనియే ఏపనిని చేయరాదు. సరే. ఇక ఆ మానవుడు తనకని ఏమియును చేసి కొననక్కరలేని స్థితి కలిగినదనుకొందము; ఇక ఏమిచేయ వలయును ? ఇంక నేను ఏమియును చేయనక్కరలేదని కర్మలు మానరాదు. తన బాధ్యతలో ఇంతవరకు సగమే నెరవేరినది. అందుచేత తనకని ఏమియును చేయనక్కరలేకపోయినది. కాని మిగిలిన బాధ్యత అట్లనే ఉన్నదిగదా ? లోకముకొరకని చేయ

వలసినది మిగిలిలేదా ? అది చేయకపోయినను తన బాధ్యత నిర్వహించని దోషము రాగలదు. కనుక 'ఓమానవుడా ! కేవలము స్వార్థపరుడవై, నీ మోక్షమును మాత్రమే చూచుకుని అంతటితో నీపని అయిపోయినదని మురియబోకుమా !' అని గీత హెచ్చరించుచున్నది. కనుక గీతకు 'కర్మసన్న్యాసముకంటె, కర్మయోగమే పరిపూర్ణముగా అభిమతము' అని సిద్ధాంతమైనది.

శ్లో॥ జ్ఞేయ స్స నిత్యసన్న్యాసీ
యో నద్వేష్టి నకాంక్షతి ।
నిర్ద్వంద్వో హి మహాబాహో!
సుఖం బంధా త్ప్రముచ్యతే ॥ 3

ప. వి :-జ్ఞేయః, సః, నిత్యసన్న్యాసీ, యః, న, ద్వేష్టి, న, కాంక్షతి, నిర్ద్వంద్వః, హి, మహాబాహో, సుఖం, బంధాత్, ప్రముచ్యతే.

టీక :—

మహాబాహో = ఓ అర్జునా !
యః = ఎవడు,
నద్వేష్టి = ద్వేషించడో,
న కాంక్షతి = కోరడో,
నిర్ద్వంద్వః హి = ద్వంద్వములు లేనివాడో,

సః = వాఁడు,
నిత్యసన్న్యాసీ = నిత్యసన్న్యాసి,
(ఇతి = అని)
జ్ఞేయః = తెలియఁదగినవాఁడు, (తెలిసికొనుము అని భావము)

(అట్టివాఁడు) సుఖం = సుఖముగా,
బంధాత్ = బంధనమునుండి
ప్రముచ్యతే = ముక్తుఁడగుచున్నాఁడు.

తా. అర్జునా ! ఎవఁడు ఎవ్వరిని ద్వేషించఁడో; ఏమియునుకోరఁడో; సుఖదుఃఖాది ద్వంద్వములు లేనివాఁడో; వాఁడు నిత్యసన్న్యాసి. సంసార బంధనమునుండి సుఖముగా బయటపడుచున్నాఁడు.

అ మృ త వా హి ని :-

ద్వంద్వములనగా సుఖదుఃఖములు, లాభనష్టములు, జయాపజయములు, శీతోష్ణములు, జననమరణములు మొదలగునవి.

ఇంకను కృష్ణపరమాత్మ చెప్పుచున్నాఁడు - అర్జునా ! సన్న్యాసి అనగా కర్మను విడిచిపెట్టినవాఁడేయని తలంచకుము. కర్మను చేయువాఁడు కూడ సన్న్యాసియే. భగవత్సృష్టిలో ఏజీవిని ఏ సందర్భములోను, ఎంతమాత్రమును ఎవఁడు ద్వేషించఁడో; బ్రహ్మలోకపర్యంతమైన భోగములయందే కాదు, చివరకు జన్మరాహిత్యమునందు కూడ ఎవనికి ఎంత

మాత్రమును కోరిక లేదో; సుఖదుఃఖములు, లాభనష్టములు, జయాపజయములు, చావుబ్రతుకులు మొదలగు ద్వంద్వముల యందు ఎవనికి ఎంతమాత్రము స్పృహయే లేదో, వాడు నిత్యసన్న్యాసి సుమా ! మహాభయంకరమైన, మహాప్రబలమైన ఈ సంసారబంధనములనుండి ఎంతమాత్రమును కష్టము లేకుండ సుఖముగా అతడు ముక్తి పొందుచున్నాడు. ఈ విషయమును నీవు బాగుగా తెలిసికొనుము.

సన్న్యాసికి, నిత్యసన్న్యాసికి భేదమేమి అని ప్రశ్న. ఉపవాసి, నిత్యోపవాసి అని భేదమున్నట్లే, సన్న్యాసి, నిత్యసన్న్యాసి అని భేదమున్నది.

ఉపవాసి అనగా ఏమియును ఆహారమును తీసికొనక ఉండువాడు; నిత్యోపవాసి అనగా జిహ్వాచాపల్యమునకు లోబడి కాకుండ, కేవలము క్షున్నివారణను మాత్రమే దృష్టిలో ఉంచుకొని అరకడుపు ఆహారముతో, పాతిక కడుపు నీటితో, మిగిలిన పాతిక కడుపు గాలికి వదిలి ఇట్లు రెండు పూటల భుజించుచు, మధ్యమధ్య ఏమియును భుజించనివాడు. జిహ్వాచాపల్యము లేక ఇట్లు భుజించినను ఉపవాసియే అగుచున్నాడు. ఆహారము మీదనే దృష్టిఉంచుకొని బాహ్యము కు భుజించకున్నను వాడు భుజించినవాడే అగుచున్నాడు. అట్లే ఎవనికి ఎంతమాత్రమును కోరికలు లేవో, ఎవడు ఏ జీవిని

ఎంతమాత్రమును ద్వేషించడో, ఎవడు సుఖదుఃఖాది ద్వంద్వములను లెక్కచేయడో అట్టివాని రాగద్వేషములు నశించినవి గనుక, అతడు లోకకల్యాణముకొరకు భగవదర్పణ బుద్ధితో అన్నికర్మలు చేసినను, వాడు కర్మలు చేయనివాడే. వాడే నిత్యసన్న్యాసి. వాడు మృత్యురూపమగు సంసార సాగరమునుండి అనాయాసముగా తరించుచున్నాడు. ప్రకృతి యొక్క ఇనుపసంకెళ్ళనుండి అనాయాసముగా బయటపడు చున్నాడు. ప్రకృతిబంధనములనుండి వాడు తన ప్రయత్న ముతో బయటపడుటకు ప్రయత్నించినగదా, కష్టముగానో, అనాయాసముగానో బయటపడుట ! - వాడు భగవదనుగ్రహ ముతో బయటపడుచున్నాడు. కనుక సుఖముగా బయటపడు చున్నాడు. కాని కర్మసన్న్యాసి మాత్రము ఇంత అనాయాస ముగా, ఇంత సుఖముగా బయటపడలేడుసుమా అని కృష్ణ పరమాత్మ భావము. "క్లేశోఽధికతర స్తేషా మవ్యక్తాస క్త చేతసామ్" (12-5) అని చెప్పబడియున్నదిగదా !

శ్లో॥ సాంఖ్యయోగౌ పృథ గ్బాలాః
ప్రవదంతి న పండితాః ।
ఏకమ ప్యాస్థిత స్సమ్య
గుభయో ర్విందతే ఫలమ్ ॥ ౪

ప. వి :—సాంఖ్యయోగౌ, పృథక్, బాలాః, ప్రవదంతి, న, పండితాః, ఏకం, అపి, ఆస్థితః, సమ్యక్, ఉభయోః, విందతే, ఫలమ్.

టీక :—

సాంఖ్యయోగౌ = కర్మసన్న్యాసమును, కర్మయోగమును,
పృథక్ = వేరువేరు ఫలములనిచ్చునవిగా,
బాలాః = వివేకములేనివారు,
ప్రవదంతి = చెప్పుచున్నారు;
పండితాః = పండితులైనవారు,
న (ప్రవదంతి) = అట్లు చెప్పరు;
ఉభయోః = రెంటిలో,
ఏకమపి = ఏ ఒక్కదానినైనను,
సమ్యక్ = బాగుగా,
ఆస్థితః = అనుష్ఠించువాడు,
ఫలం = ఫలమును,
విందతే = పొందుచున్నాడు.

తా. కర్మసన్న్యాసమును, కర్మయోగమును వేరువేరని అజ్ఞానులు తలతురు. పండితులు అట్లు చెప్పరు. పైకి రూపములు వేరువేరుగ ఉన్నను, ఫలముమాత్ర మొక్కటే. కనుకనే ఈ రెంటిలో దేనినైనను బాగుగ అనుష్ఠించినవాడు మోక్షఫలమును పొందుచున్నాడు.

అమృతవాహిని :—

అర్జునా ! కర్మసన్న్యాసమును, కర్మయోగమును, వేరువేరు మార్గములే అయినను ఫలముమాత్రము రెంటికిని

ఒక్కటే. ఈ రెండును వేరువేరు ఫలములనిచ్చునవిగా, తెలి యనివారు - అజ్ఞానులు - చెప్పుదురు. తెలిసినవారు అట్లు ఎన్నటికిని చెప్పరు. ఈ రెంటిలో దేనిని బాగుగా అనుష్ఠించినను మోక్షమును పొందగలరు. కర్మసన్న్యాసమును ఆశ్రయించిన వాడును, కర్మయోగమును ఆచరించినవాడును ఇద్దరును మోక్ష మును పొందుచున్నారు అని కృష్ణపరమాత్మ భావము.

కర్మసన్న్యాసము, కర్మయోగము వేరుగా అజ్ఞానులు తలచెదరు. పండితులు అట్లు తలంచరు అనినప్పుడు ఈ రెండు పేర్లును ఒకదానినే చెప్పు పర్యాయపదములని పరమాత్మ చెప్పి నట్లు భ్రాంతిపడరాదు. ఈ రెండు మార్గములును వేరువేరే. కాని ఈ రెంటియొక్క ఫలముమాత్రము ఒక్కటే. ఫలము నిచ్చుటలో ఈ రెండును ఒక్కటే అనియే భావము. కానిచో ఈ శ్లోకములోనే ఈ రెంటిలో ఏ ఒక్కదానిని ఆశ్రయించినను ఫలమును పొందుచున్నాడు అనియును, రెండవ శ్లోకములో కర్మసన్న్యాసముకంటె కర్మయోగము శ్రేష్ఠమైనది అనియును చెప్పినదానికి అర్థముండునా? కృష్ణపరమాత్మ ఈ రెండుచోట్ల ఇట్లు చెప్పుటచే ఆయన అభిప్రాయములో మార్గములు మాత్రము వేరువేరైనవే; ఫలము నిచ్చుటలో మాత్రము ఒక్కటే అనియే.

ఇంక ఇతరులు కొంతమంది ఇట్లందురు: కర్మయోగము ప్రత్యేకముగ మోక్షము నీయలేదు. సాధకుడు కర్మయోగము

ననుష్ఠించి, తరువాత కర్మసన్న్యాసమునకు అధికారియై మోక్షమును పొందుచున్నాడు. ఇక్కడ కర్మయోగముచేత కూడ మోక్షము లభించుచున్నది అని చెప్పుట క్రమముగా ముక్తి అని - అనగా ముక్తికి కర్మ పరంపరయా హేతువు అనిగాని, లేక కర్మయోగమునందు కూడ అభిలాష కలిగించుటకై స్తుతి అనిగాని తలంచవలయును. మోక్షము మాత్రము కర్మసన్న్యాసముచేతనే కలుగును.

ఈ అర్థము కొంచెము పట్టుదలతో ప్రయత్నించినట్లు అనిపించుచున్నది. వక్తయొక్క యథార్థమైన అభిప్రాయమే ఇక్కడ మనకు కావలసినది. వక్త చాల వెనుకనుండి ఈ రెండు మార్గములును మోక్షప్రదములని చెప్పుచునే ఉన్నాడు. ఇవి రెండును స్వతంత్రమార్గములని కూడ ఆయన అభిప్రాయము. ఫలము నిచ్చుటలో మాత్రము రెండును ఒక్కటియే అనినాడు. కనుక కేవలము ఫలము దృష్టితో చూచినయెడల ఈ రెండు మార్గములవారును వివాదపడవలసిన పనిలేదు. ఎవరికి ఏ మార్గము నచ్చిన ఆ మార్గమునే అవలంబింపవచ్చును. మోక్షమును పొందవచ్చును.

కృష్ణపరమాత్మకు ఈ రెండు మార్గములలో ఏదిశ్రేష్ఠము? ఏది శ్రేష్ఠము? కర్మయోగము స్వయముగా మోక్షము నియ్యగలది అని ఆయన చెప్పినాడా లేదా? ఈ అంశములు మాత్రము జాగ్రత్తతో విచారించవలసి ఉన్నది.

కర్మసన్న్యాసమార్గమునందు అంతఃకరణశుద్ధికొరకు ప్రారంభములో కర్మ చేసినను, సిద్ధదశయందు మాత్రము కర్మ వదలిపెట్టియే తీరవలయును. కర్మయోగములో ప్రారంభదశయందు తన అంతఃకరణశుద్ధి కొరకును, సిద్ధదశయందు లోక కల్యాణము కొరకును కర్మ చేయబడుచునే ఉండును. కృష్ణపరమాత్మ "ఏకమ ప్యాస్థిత స్సమ్య గుభయో ర్విందతే ఫలమ్" అని ఈ రెండు మార్గములచేత మోక్షమున్నట్లు ఒప్పుకొనియే ఉన్నాడు. కాని ఆయనకు ఈ రెంటిలో కర్మయోగమే చాల ఇష్టమని గీతలో పలుచోట్ల బాగుగ కనబడుచున్నది. అందు వలననే "కర్మసన్న్యాసా త్కర్మయోగో విశిష్యతే" అని ఎలుగెత్తి చాటినాడు. ఈ సందర్భమును గురించి రెండవశ్లోకము యొక్క వ్యాఖ్యానములో వివరించియున్నాము.

అవతారిక :-

మరల ఈ శ్లోకములోకూడ ఈ రెంటిచేతను కలుగు ఫలము ఒక్కటే అని నిరూపించుచున్నాడు.

శ్లో॥ యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం
తద్యోగై రపి గమ్యతే ।
ఏకం సాంఖ్యంచ యోగంచ
యః పశ్యతి స పశ్యతి ॥ ౫

ప. వి :—యత్, సాంఖ్యైః, ప్రాప్యతే, స్థానం, తత్, యోగైః, అపి, గమ్యతే, ఏకం, సాంఖ్యం, చ, యోగం, చ, యః, పశ్యతి, సః, పశ్యతి.

టీక :—

సాంఖ్యైః = సాంఖ్యులచేత = జ్ఞానులచేత - కర్మసన్న్యాసులచేత,

యత్ స్థానం = ఏ స్థానము - పరమధామము,

ప్రాప్యతే = పొందబడుచున్నదో,

తత్ = ఆ స్థానము - పరమధామము,

యోగైరపి = అహంకార మమకారములను త్యజించి, భగవదర్పణబుద్ధితో కర్మలు చేయువారి చేతకూడ,

గమ్యతే = పొందబడుచున్నది,

సాంఖ్యంచ = కర్మసన్న్యాసమును,

యోగంచ = భగవదర్పణబుద్ధితో కర్మ చేయుట అను యోగమును,

ఏకం = ఒకటిగా - ఒకే ఫలము నిచ్చునవిగా,

యః = ఎవడు,

పశ్యతి = చూచుచున్నాడో - తెలిసికొనుచున్నాడో,

సః = వాడు,

పశ్యతి = చూచుచున్నాడు - యథార్థమును తెలిసికొనినవాడు.

తా. కర్మసన్న్యాసులు పొందెడి మోక్షమును, భగవదర్పణబుద్ధితో కర్మచేయు యోగులు సైతము పొందుచున్నారు. కర్మసన్న్యాసమును, భగవదర్పణబుద్ధిలో చేయు కర్మయోగమును కూడ మోక్షమునిచ్చుటలో ఒక్కటే అని ఎవడు తెలిసికొనుచున్నాడో వాడే యథార్థము తెలిసినవాడు.

అమృతవాహిని :–

కృష్ణపరమాత్మ ఇంకను సాంఖ్య యోగులను గురించియేం చెప్పుచున్నాడు - సాంఖ్యులనినను, జ్ఞానులనినను, కర్మ సన్న్యాసులనినను ఒకేఅర్థములో కృష్ణపరమాత్మ ప్రయోగించి యున్నాడు.

అర్జునా ! కర్మసన్యాసులు ఏ స్థానమును పొందు చున్నారో, ఆ దేస్థానమును రాగద్వేష శూన్యులై, ఆసక్తి, ఫలాభిలాష లేక అహంకార మమకార రహితులై కేవలము భగవంతుని చేతి పరికరమాత్రులై భగవత్కైంకర్యబుద్ధితో కర్మచేయువారు సైతము ఆ స్థానమునే పొందుచున్నారు.

"యదేవ యోగాః పశ్యంతి
సాంఖ్యై స్తదనుగమ్యతే ।
ఏకం సాంఖ్యంచ యోగంచ
యః పశ్యతి స బుద్ధిమాన్ ॥"

(శాంతిపర్వము - 305 - 19)

తా. యోగులు దేనిని సాక్షాత్కరించుకొనుచున్నారో, సాంఖ్యులు కూడ దానినే పొందుచున్నారు. ఎవడైతే సాంఖ్యమును, యోగమును (ఫలమునిచ్చుటలో) ఒకటిగా చూచునో వాడే బుద్ధిమంతుడు అనియును,

"యదేవ యోగాః పశ్యంతి
తత్సాంఖ్యై రపి దృశ్యతే ।
ఏకం సాంఖ్యంచ యోగంచ
యః పశ్యతి స తత్త్వవిత్ ॥"

(శాంతిపర్వము - 316 - 4)

తా. యోగులు దేనిని సాక్షాత్కరించుకొనుచున్నారో, సాంఖ్యుల చేత కూడ అదియే చూడబడుచున్నది. కాబట్టి సాంఖ్యమును, యోగమును ఒకటిగా చూచువాడే యథార్థముగా తత్త్వము తెలిసినవాడు అని గీతలోని భావమే భారతము శాంతిపర్వములోని పై శ్లోకములలోకూడ చెప్పబడి యున్నది.

శ్లో॥ సన్న్యాసస్తు మహాబాహో !
దుఃఖ మాప్తు మయోగతః ।
యోగయుక్తో ముని ర్బ్రహ్మ
న చిరే ణాధిగచ్ఛతి ॥ ౬

ప. వి :— సన్న్యాసః, తు, మహాబాహో, దుఃఖం, ఆప్తుం, అయోగతః, యోగయుక్తః, మునిః, బ్రహ్మ, న, చిరేణ, అధిగచ్ఛతి.

టీక :—

మహాబాహో! = అర్జునా!
అయోగతః = నిష్కామ కర్మయోగము లేనివానికి,

సన్న్యాసస్తు = కర్మసన్న్యాసము,
ఆప్తుం = పొందుటకు,
దుఃఖం = దుర్లభము,
యోగయుక్తః = కర్మయోగియైన,
మునిః = ముని,
బ్రహ్మ = పరమాత్మను,
నచిరేణ = శీఘ్రముగా,
అధిగచ్ఛతి = పొందుచున్నాడు.

తా. కర్మయోగముచే అంతఃకరణపరిశుద్ధి కలిగి సమస్తేంద్రియములను, చిత్తమును బాగుగా వశమందుంచుకొనిన తరువాతగాని సన్న్యాసమున కధికారము లేదు. ముందు భ్రాంతిచేత సన్న్యాసము నాశ్రయించినయెడల, దానిచేత దుఃఖమేగాని సుఖములేదు. కాబట్టి, కర్మయోగముతో కూడినవాడై, అంతఃకరణపరిశుద్ధి కలిగిన ముని శీఘ్రముగ పరమాత్మను పొందుచున్నాడు.

అ మృ త వా హి ని :—

అర్జునా ! ఇంకొక రహస్యమున్నది. కర్మయే పనికి రానిది, బంధనము అయిన, అది ఎట్లు చేసినను బంధనమే కావలయును. అట్లు అగుటలేదు. కర్మసన్న్యాసమునే సమర్థించుకొనువారుకూడ ఆ కర్మసన్న్యాసము సిద్ధించుటకు మొదట కర్మయోగమును ఆశ్రయించియే తీరవలయును. లేనియెడల దుఃఖమేతప్ప ప్రయోజనము ఉండదు. ఆ విష

యము వారుకూడ అనుచునేయున్నారు. వారి అభిప్రాయము ప్రకారమైనను కర్మ అజ్ఞానచిహ్నమే అయిన,నిష్కామ్యముగా నైనను, అట్టి కర్మ నాచరించిన, అంతఃకరణశుద్ధియై జ్ఞానము కలుగుట ఎట్లు సంభవించును ? అజ్ఞానిగా ఉన్నప్పుడే నిష్కామ్యముగా చేసినచో, అది బంధన హేతువు కాకపోగా, అంతఃకరణ పరిశుద్ధిని కలుగజేసి, జ్ఞానమునకు హేతువగు చున్నదే ! ఇక వాసనారహితముగానుండు సిద్ధదశయందు కర్మ చేసిన బంధన మెట్లగును ? అజ్ఞానదశలో చేసిన సాధకుని అంతఃకరణపరిశుద్ధికి, జ్ఞానమునకు హేతువగును. సిద్ధదశలో చేసిన లోకకల్యాణమునకు హేతువగును. కనుక ఎట్లు చూచినను కర్మయోగియే అతిశీఘ్రముగ పరమాత్మను పొందుచున్నాడు.

మరొక విధమునకూడ అర్థము చెప్పవచ్చును.

అయోగతః = అంతఃకరణ పరిశుద్ధికిని, జ్ఞానమునకును హేతువైన కర్మయోగము నాచరించక,

సన్న్యాసః = సన్న్యాసము,

దుఃఖం = దుఃఖమును,

ఆప్తుం = పొందుటకే.

అనగా చక్కగా కర్మయోగము నాచరించి, అంతఃకరణ పరిశుద్ధిని, జ్ఞానమును పొందకయే, కర్మసన్న్యాసమును

గ్రహించినయెడల, ఆ సన్న్యాసమువలన ప్రయోజనము దుఃఖమే అని. అంతియేగదా ! అంతఃకరణపరిశుద్ధిలేనివానికి సన్న్యాసమునకు అధికారములేదు. శంకరానందులు ఈ అధ్యాయములోని నాల్గవ శ్లోకముయొక్క వ్యాఖ్యానములో "తత్త్వమస్యాది వాక్యాని పుంస శ్చిత్తశు ద్ధ్యభావే బ్రహ్మాత్త్వం బోధయితుం న శక్నువంతి! చిత్తశుద్ధిశ్చ కర్మోపాసనాభ్యాం వినా నసిద్ధ్యతే॥"

'తత్త్వమసి' మొదలగు వాక్యములు చిత్తశుద్ధిలేని పురుషునకు బ్రహ్మాత్త్వమును బోధించలేవు. చిత్తశుద్ధియో, కర్మోపాసనములు లేక సిద్ధించదు - అని సిద్ధాంతము చేసియున్నారు. కనుక కర్మయోగము నాచరించి చిత్తశుద్ధిని పొందకుండ, సన్న్యాసమును గ్రహించినయెడల, అట్టి సన్న్యాసము దుఃఖమును పొందుటకే. దానివలన దుఃఖమే ప్రయోజనము. ఇక, రాగద్వేషశూన్యులై, ఆసక్తి, ఫలాభిలాష - లేక, అహంకార మమకార రహితులై, భగవత్కైంకర్య రూపముగా భగవదర్పణబుద్ధితో కర్మచేయు యోగులో సులభముగా శీఘ్రముగా పరబ్రహ్మమును పొందుచున్నారు. ఇట్టివారినిగూర్చియే భగవంతుడు "తేషా మహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్" అని గర్జించినాడు. కాన యోగులకు - అనగా భక్తులకు - మోక్షము పొందుటలో ఆలస్యమును లేదు, ఆయాసమును లేదు. సారాంశమేమన, సన్న్య

సముయొక్క, కర్మయోగముయొక్క ఫలము ఒకటే; అయినను సాధనలో కర్మయోగముకంటె సన్న్యాసము కఠినతరము. కర్మయోగము సులభము, శీఘ్రఫలదము. కాబట్టియే మూడవ శ్లోకములో "సుఖం బంధాత్ప్రముచ్యతే" అనియును, ఈ ఆరవ శ్లోకములో "బ్రహ్మ నచిరేణాధిగచ్ఛతి" అనియును ఉన్నది. కనుక కర్మసన్న్యాసముకంటె కర్మయోగమే మిక్కిలి శ్రేష్ఠమైనది.

శ్లో॥ యోగయుక్తో విశుద్ధాత్మా
విజితాత్మా జితేంద్రియః ।
సర్వభూతాత్మ భూతాత్మా
కుర్వన్నపి నలిప్యతే॥ 7

ప. వి :— యోగయుక్తః, విశుద్ధాత్మా, విజితాత్మా, జితేంద్రియః, సర్వభూతాత్మ భూతాత్మా, కుర్వన్, అపి, న, లిప్యతే.

టీక :—

విశుద్ధాత్మా = వాసనారహితమైన అంతఃకరణము కలిగినట్టియు,
విజితాత్మా = బాగుగా స్వాధీనమైన మనస్సు కలిగినట్టియు,
జితేంద్రియః = ఇంద్రియములను జయించినట్టియు,

సర్వభూతాత్మ భూతాత్మా = సమస్తమైన జీవులకును ఆత్మగానున్న పరమాత్మకు ఆత్మభూతుడైనట్టియు,
యోగయుక్తః = కర్మయోగి,
కుర్వన్ అపి = కర్మలు చేయుచున్నను,
నలిప్యతే = (వాటిచేత) అంటబడడు.

తా. నిష్కామ్యముగ కర్మయోగము ఆచరించుటచే పరిశుద్ధమైనట్టియు, స్వాధీనమైనట్టియు అంతఃకరణము కలవాడును, ఇంద్రియములను జయించినవాడును, సర్వభూతములకును ఆత్మభూతమైన పరమాత్మ కలవాడును - అనగా పరమాత్మను పొందినవాడును - అయిన మహాత్ముడు లోకకల్యాణార్థము కర్మ చేయుచున్నను, ఆ కర్మ వానిని బంధించలేదు. అంతేకాక లోకమునకు మిక్కిలి మేలుకూడ చేకూర్చును.

అమృతవాహిని :-

సాధకుడు భగవదర్పణబుద్ధితో భగవత్కైంకర్య రూపముగా కర్మలు చేయుటచేత కొంతకాలమునకు ఆసక్తి, ఫలాభిలాష పూర్తిగ నశించి, తరువాత రాగద్వేషములు నశించగా, అంతఃకరణము పూర్తిగ వాసనారహితమై పరిశుద్ధి చెందును. అంతఃకరణము పూర్తిగ పరిశుద్ధమైననాడు, మనస్సు పరమ సాత్త్వికమై సకలసద్గుణములును, పరిపూర్ణమైన ప్రేమయు కలిగిన పతివ్రత భర్తకు ఎట్లు స్వాధీనయై

యుండునో అట్లు వశమైపోవును. మనసు వశమైనంతనే ఇంద్రియములు తమంత తామే వినయ విధేయతలు కలిగిన సేవకులవలె భయభక్తులతో మెలగును. ఆ స్థితిపొందిన యోగిచేత భగవత్కైంకర్య రూపముగా ఎన్నికర్మలు చేయబడిననేమి ? ఆ కర్మలు ఆతనిని ఎంతమాత్రమును అంటవు. ఇక బంధించుట ఎక్కడ ?

"సర్వభూతాత్మ భూతాత్మా" - పిపీలిక మొదలుకొని బ్రహ్మపర్యంతమైన సకల జీవరాసులకును, ఆత్మయైన పరమాత్మ ఎవనికి ఆత్మయో వాడు సర్వభూతాత్మ భూతాత్ముడు. వాడు తనకు ఆత్మయైన పరమాత్మయొక్క ప్రేరణచేతనే సకలమైన కర్మలను చేయుచుండును. అతనికి ఒక్క పరమాత్మయందు తప్ప ఇల్లు, వాకిలి, గొడ్డు, గోద, శరీరము, మనస్సు, బుద్ధి మొదలగు దేనియందును కించిన్మాత్రముకూడ మమత్వము ఉండదు. అట్టివాడు ఎన్నికర్మలు చేసిననేమి ? ఆతనికి అవి ఎంతమాత్రమును అంటవు.

ఎవనికి అంతఃకరణము వాసనలతో కూడుకొనియుండి మనస్సు, బుద్ధి, ఇంద్రియములు స్వాధీనములో ఉండవో, అట్టివానికి స్వాభావికముగనే విషయములయందు ప్రవృత్తి కలుగును. విషయములయందు ప్రవృత్తి కలుగుటతో రాగద్వేషములు బలపడును. ఇక సిద్ధ్యసిద్ధులయందు సమత ఎట్లుండగలదు ?

కాబట్టి నిష్కామ్యముగ కర్మలు చేయుట అభ్యసించవలయును. నెమ్మది నెమ్మదిగా అంతఃకరణము పరిశుద్ధమై మనస్సు, ఇంద్రియములు పూర్తిగ వశపడునప్పటికి సాధకుడు సిద్ధుడై యోగి అనబడును. అట్టివాడు లోకసంగ్రహార్థము ఎన్నికర్మలు చేసినను అవి వానిని అంటవు సరిగదా, లోకము నకు కల్యాణదాయకములుకూడ అగును.

అవతారిక :-

ఇప్పుడు కర్మయోగికి తనచేత చేయబడు కర్మలయం దెట్లు అహంకారము ఉండదో ఎనిమిది తొమ్మిది శ్లోకములలో చెప్పుచున్నాడు.

శ్లో॥ నైవ కించి త్కరో మీతి
యుక్తో మన్యేత తత్త్వవిత్ ।
పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్ర
న్నశ్న న్గచ్ఛ న్స్వపన్ శ్వసన్ ॥ ౮

శ్లో॥ ప్రలప న్విసృజ న్గృహ్ణ
న్నున్మిష న్నిమిష న్నపి ।
ఇంద్రియా ణీంద్రియార్థేషు
వర్తంత ఇతి ధారయన్ ॥ ౯

ప. వి :—న, ఏవ, కించిత్, కరోమి, ఇతి, యుక్తః, మన్యేత, తత్త్వవిత్, పశ్యన్, శ్రుణ్వన్, స్పృశన్, జిఘ్రన్, అశ్నన్, గచ్ఛన్, స్వపన్, శ్వసన్. ౮

ప. వి :—ప్రలపన్, విసృజన్, గృహ్ణన్, ఉన్మిషన్, నిమిషన్, అపి, ఇంద్రియాణి, ఇంద్రియార్థేషు, వర్తంతే, ఇతి, ధారయన్. ౯

టీక :—

యుక్తః = యోగి - భగవదర్పణబుద్ధిలో, భగవత్కైంకర్యరూపముగా కర్తృత్వాభిమానాహంకారము లేక కర్మను చేయువాడు -

తత్త్వవిత్ = తత్త్వము తెలిసినవాడై నిష్కామ కర్మయోగముచేత అంతఃకరణపరిశుద్ధి ద్వారా తత్త్వజ్ఞానము కలవాడై -

పశ్యన్ = చూచుచు,

శ్రుణ్వన్ = వినుచు,

స్పృశన్ = తాకుచు,

జిఘ్రన్ = ఆఘ్రాణించుచు,

అశ్నన్ = భుజించుచు,

గచ్ఛన్ = నడచుచు,

స్వపన్ = నిద్రించుచు,

శ్వసన్ = ఊపిరి విడుచుచు,
ప్రలపన్ = మాట్లాడుచు,
విసృజన్ = (మలమూత్రములు) విడుచుచు,
గృహ్ణన్ = గ్రహించుచు,
ఉన్మిషన్ = కన్నులు తెరచుచు,
నిమిషన్ అపి = కన్నులు మూయుచు కూడ,
ఇంద్రియాణి = ఇంద్రియములు,
ఇంద్రియార్థేషు = శబ్దాది విషయములందు,
వర్తంతే = వర్తించుచున్నవి,
ఇతి = అని,
ధారయన్ = నిశ్చయించి,
కించిత్ = కొంచెముకూడ,
నకరోమ్యేవ = నేనుచేయుటలేనేలేదు.
ఇతి = అని,
మన్యేత = తలంచును.

తా. తత్త్వము తెలిసిన కర్మయోగి చూచుచు, వినుచు, తాకుచు, వాసన చూచుచు, భుజించుచు, నడచుచు, నిద్రించుచు, శ్వాస తీసికొనుచు, మాట్లాడుచు, విడుచుచు, గ్రహించుచు, కండ్లు తెరచుచు, మూయుచు - ఇన్ని పనులు జరుగుచున్నను, ఇంద్రియములు శబ్దాది విషయములందు ప్రవర్తించుచున్నవి, నేనేమియు చేయుటలేదు అని తలంచును. కర్తృత్వాహంకారములు ఎంతమాత్రమును అతనికి ఉండవు. అందుచేత ఆ కర్మలు అతనికి అంటవు.

అమృతవాహిని :—

తత్త్వము తెలిసినవారికి కర్మలయందు అహంకార కర్తృత్వాభిమానము లుండవు. అహంకారము కర్తృత్వాభిమానము కలవాడును - సంసారులును - చూచుచుందురు. అభిమానము లేనివాడును - యోగులును - చూచుచుందురు. సంసారులు చూచుటచేత ఆ చూపుయొక్క ప్రభావము చిత్తముమీాద పడును. దానికి ఫలము తగినరీతిని చిత్తములో వికారము కలుగును. ఆ వికారమునకు అనుగుణముగా వాడు కర్మ చేయును. అందువలన అట్టివాని చూపుగాని, దానిచేత కలిగిన చిత్తవికారముగాని, ఆ వికారానుగుణముగ వాడు చేయు కర్మగాని పాపముగానో, పుణ్యముగానో ఉండును. అప్పుడు వాడు ఆ పాపపుణ్యములచేత బంధింపబడును. ఆ పాప పుణ్యఫలములు అనుభవింపవలసివచ్చును.

అహంకార కర్తృత్వాభిమానములు లేని యోగియును చూచును. కాని ఆ చూపుయొక్క ప్రభావము చిత్తముమీాద పడదు; వికారమును కలిగించదు. అందుచేత అతడు చిత్త వికారములకు లోనై ఏ కర్మయును చేయడు. ఆ కారణమున ఆ కర్మ పాపపుణ్య రూపముగా అతనిని బంధించదు. ఆ ఫల మును వానికి చెందదు.

అతని అంతఃకరణము ఏ వాసనయు లేక పరిశుద్ధమై యుండును గనుక, అతడు ఇంక కర్మ ఎట్లు చేయును అని

సందేహము రావచ్చును. లోకములో ప్రతివారును కర్మ చేయుటకు వారి వాసనలే కారణముగదా! ఇతనికి వాసనలే లేవు. ఇక ఇతడు కర్మ ఎట్లు చేయును?

ఇట్టివాడు కూడ కర్మ చేయకుండ ఉండడు. అయితే, ఇతడు చేయు కర్మకు భగవత్ప్రేరణమే కారణము. అందువలన ఆ కర్మచేత ఇతడు బంధింపబడకపోగా, లోకమునకు కల్యాణము చేకూర్చినవాడగును.

అవతారిక :—

ఇంకను యోగిని గురించియే చెప్పుచు, అతడు కర్మ చేత ఎందుకు అంటబడడో చెప్పుచున్నాడు.

శ్లో॥ బ్రహ్మణ్యాధాయ కర్మాణి
సంగం త్యక్త్వా కరోతియః ।
లిప్యతే న స పాపేన
పద్మపత్ర మి వాంభసా ॥ ౧౦

ప. వి :— బ్రహ్మణి, ఆధాయ, కర్మాణి, సంగం, త్యక్త్వా, కరోతి, యః, లిప్యతే, న, సః, పాపేన, పద్మపత్రం, ఇవ, అంభసా.

టీక :—

యః = ఎవడు,
కర్మాణి = కర్మలను,

బ్రహ్మణి = పరమాత్మయందు,
ఆధాయ = సమర్పించి,
సంగం = ఆసక్తిని,
త్యక్త్వా = విడిచి,
కరోతి = చేయుచున్నాడో,
సః = వాడు,
అంభసా = నీటిచేత,
పద్మపత్రమివ = తామరాకువలనే,
పాపేన = పాపముచేత,
నలిప్యతే = అంటబడడు.

తా. భగవదర్పణబుద్ధితో, పరమాత్మయందే సమర్పించి, ఆసక్తి లేక, కర్మలు చేయువాడు, నీటిచేత తామరాకు అంటబడనట్లు, ఆ కర్మల యొక్క పాపపుణ్యములచేత అంటబడడు.

అమృతవాహిని :—

తత్త్వము బాగుగా అనుభవములో ఉన్న యోగి సమస్త కర్మలను తన ప్రభువైన పరమాత్మ నిమిత్తమే చేయును. తనకని ఏమియును చేయడు. అతనికి కర్మలమీద కూడ ఆసక్తి ఉండదు. సామాన్యులకు ఫలమునందు కాంక్ష ఉండుటయే కాక, కర్మలయందు కూడ ఆసక్తి ఉండును. ఫలాభిలాష వదలగలిగినను కర్మలయందు ఆసక్తిని వదలుట కష్టము. ఇక తత్త్వరహస్యము తెలిసిన యోగియో, ఈ కర్మ యిష్టము,

ఈ కర్మ యిష్టము లేదు అను తన యిష్టానిష్టములతో ఎంత మాత్రమును సంబంధము లేకుండ, ఏ యే కర్మలు చేయుటకు భగవంతుడు ప్రేరేపించునో ఆ కర్మలనే నిర్లిప్తుడై చేయును. ఈ ప్రకారముగా సమస్తకర్మలను, ఫలమునుకూడ సర్వేశ్వరుడైన, జగత్ప్రభువైన పరమాత్మయందే సమర్పించి చేయువానిని, సదా నీటిలోనే ఉన్నను తామరాకును నీరు అంటనట్లు, కర్మలు అంటవు. ఇట్టివానిని గురించియే పన్నెండవ అధ్యాయములో "యేతు సర్వాణికర్మాణి మయి సన్న్యస్య మత్పరాః అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంత ఉపాసతే, తేషామహం సముద్ధర్తా మృత్యుసంసార సాగరాత్" అని కృష్ణ పరమాత్మ చెప్పియున్నాడు. ఇంక ఇట్టివానికి కర్మ అంటుట కూడ ఎక్కడ ?

అవతారిక :-

అందువలననే కర్మయోగులు సాధనదశలో అంతఃకరణ శుద్ధి కొరకు కర్మ చేయుదురు అని ఈ శ్లోకములో చెప్పుచున్నాడు.

శ్లో॥ కాయేన మనసా బుద్ధ్యా
కేవలై రింద్రియైరపి ।
యోగినః కర్మ కుర్వంతి
సంగం త్యక్త్వాత్మశుద్ధయే ॥ ౧౧

ప. వి :— కాయేన, మనసా, బుద్ధ్యా, కేవలైః, ఇంద్రియైః, అపి, యోగినః, కర్మ, కుర్వంతి, సంగం, త్యక్త్వా, ఆత్మ శుద్ధయే.

టీక :—

యోగినః = కర్మయోగులందరును,
సంగం = ఆసక్తిని,
త్యక్త్వా = త్యజించి,
ఆత్మశుద్ధయే = అంతఃకరణపరిశుద్ధికొరకు,
కేవలైః = కేవలము,
ఇంద్రియైః = ఇంద్రియములచేతను,
మనసా = మనస్సుచేతను,
బుద్ధ్యా = బుద్ధిచేతను,
కాయేన = శరీరముచేతను,
అపి = కూడ,
కర్మ = కర్మలు,
కుర్వంతి = చేయుచున్నారు.

తా. కర్మయోగులు ఆసక్తి లేకుండ అంతఃకరణపరిశుద్ధి కొరకు మాత్రమే, కేవలము ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, శరీరములద్వారా కర్మ చేయుచున్నారు.

అమృతవాహిని :—

కర్మయోగులందరును మొదటినుండియు - అనగా సాధనదశలో కూడ - కర్మ కాంక్షలతో చేయరు. ఆసక్తిలేక

కేవలము అంతఃకరణపరిశుద్ధి కొరకే కర్మ చేయుచుండు. అందువల్ల కర్తృత్వాహంకారము ఎంతమాత్రమును లేకుండ, కేవలము మనస్సు బుద్ధి ఇంద్రియములచేతమాత్రమే కర్మ చేయుచుండు. ఆసక్తితో ఫలాభిలాషతో చేయబడిన కర్మ బంధనమునకు హేతువగును. ఆసక్తిరహితముగా ఫలాపేక్ష లేక చేయబడినకర్మ అంతఃకరణ పరిశుద్ధిని కలుగజేయును.

కాని కొంతమంది, కర్మ చేయుటయే నీ ధర్మముగాని, దానివలన చిత్తశుద్ధి కలుగుచున్నదా లేదా అను విచారణ ఉండకూడదని చెప్పుచున్నారు. ఆ అభిప్రాయము సరియైనది కాదు. ఈ శ్లోకములోనే "ఆత్మశుద్ధయే" 'చిత్తశుద్ధికొరకు' అని కృష్ణపరమాత్మ చెప్పినాడు. అనగా చిత్తశుద్ధికొరకు కర్మ చేయవలెనని కృష్ణపరమాత్మ చెప్పినట్లే గదా!

మురికిపోవుటకు పాత్రను తోమవలసినదిగ యజమాని ఆజ్ఞాపించినప్పుడు మురికిపోవుచున్నదా లేదా అని చూచు కొనుచు, మురికిపోవునట్లు పాత్రను తోమవలయునేగాని, మురికిపోయినను పోకపోయినను పాత్రనుమాత్రము తోముదును అని పనివాడు అనినచో యజమాని ఏమనును? ఆ పనివాని యందు యజమాని అనుగ్రహము వచ్చునా?

అట్లే 'ఆత్మశుద్ధయే' చిత్తశుద్ధికొరకే కర్మ చేయుము అని పరమాత్మ శాసించి, పెద్దలైన పూర్వులందరును చిత్తశుద్ధి కొరకే కర్మచేసిరి అని చెప్పుచుండగా, చిత్తశుద్ధి అయినన్ను

కాకపోయినను కర్మ మాత్రము చేయుదును అనినచో పరమాత్మ ఏమనును ? మనయందు పరమాత్మ అనుగ్రహము వచ్చునా ? కాబట్టి అట్లు అనరాదు.

అవతారిక :-

కర్మ ఎట్లుచేసిన శాంతికలుగునో, ఎట్లుచేసిన బంధము కలుగునో- ఈ విషయమును చెప్పుచున్నాడు.

శ్లో॥ యుక్తః కర్మఫలం త్యక్త్వా
శాంతి మాప్నోతి నైష్ఠికీమ్ ।
అయుక్తః కామకారేణ
ఫలే సక్తో నిబధ్యతే ॥ ౧౨

ప. వి :-యుక్తః, కర్మఫలం, త్యక్త్వా, శాంతిం, ఆప్నోతి, నైష్ఠికీం, అయుక్తః, కామకారేణ, ఫలే, సక్తః, నిబధ్యతే.

టీక :-

యుక్తః = నిష్కామ కర్మయోగి,
కర్మఫలం = కర్మయొక్క ఫలమును,
త్యక్త్వా = త్యజించి (త్యజించుటచేతనే),
నైష్ఠికీం = ఆధ్యాత్మిక సంబంధమైన,
శాంతిం = శాంతిని,

ఆప్నోతి = పొందుచున్నాడు;
అయుక్తః = అట్టియోగికానివాడు (కామ్యముతో కర్మ చేయువాడు),
ఫలే = ఫలమునందు,
సక్తః = ఆసక్తి కలిగినవాడై,
కామకారేణ = ఆ ఆశ చేతనే,
నిబధ్యతే = బంధింపబడుచున్నాడు.

తా. నిష్కామకర్మ చేయువాడు కర్మఫలమును త్యజించుటచేతనే ఆధ్యాత్మికశాంతిని పొందుచున్నాడు. కాంక్షకలవాడు కర్మఫలమునందు ఆశకలవాడై ఆ ఆశచేతనే బంధింపబడుచున్నాడు.

అ మృ త వా హి ని :-

ఈ శ్లోకములో పురుషుడు శాంతినిపొందుటకు మార్గమేమి, ఎందువలన బంధింపబడుచున్నాడు అను విషయములను సంశయరహితముగ తేల్చి చెప్పినాడు. ఫలమందు ఎంతమాత్రమును అభిలాషలేక కర్మ చేయువాడు ఆధ్యాత్మిక శాంతిని పొందుచున్నాడు. దానికి కారణము ఫలాభిలాషను త్యజించుటయే. అనగా ఆశలేనివానికే యథార్థమైన శాంతి.

ఉత్తరభాగములో ఇతరునికి లేదను విషయమును చెప్పుచున్నాడు. ఫలమునందలి ఆశతో కర్మచేయువాడు బంధింపబడుచున్నాడు. దానికి కారణము ఫలాభిలాషయే.

ఆశ కలవానికి ఎక్కడకు పోయినను శాంతి లభించదు. వాని ఆశచేతనే వాడు బంధింపబడుచున్నాడు. పదునారవ అధ్యాయమున పన్నెండవ శ్లోకములో "ఆశాపాశశతైః ర్బద్ధాః" అని చెప్పబడి యుండుటచేత ఆశయే బంధించెడి పాశము, ఆశా పాశములచేతనే జీవులన్నియును బంధింపబడియున్నవి అని తెలియవలయును. ఆశ లేనివాడే యధార్థమైన సుఖి. కనుక ఆశ లేనివాడే పైన చెప్పబడిన ఆ శాంతిసుఖమును అనుభవించగలుగును.

శ్లో॥ సర్వ కర్మాణి మనసా
సన్న్యస్యాస్తే సుఖం వశీ ।
నవద్వారే పురే దేహీ
నైవ కుర్వన్ నకారయన్॥ ౧౩

ప. వి:-సర్వకర్మాణి, మనసా, సన్న్యస్య,ఆస్తే, సుఖం, వశీ, నవద్వారే, పురే, దేహీ, న, ఏవ, కుర్వన్, న, కారయన్.

టీక:—

వశీ = మనోబుద్ధీంద్రియ శరీరములు వశమునందు కలవాడు,

మనసా = వివేకయుక్తమైన మనస్సుచేత,

నవద్వారే = తొమ్మిది ద్వారములుగల,

పురే = పురమనియెడి.
దేహే = శరీరమునందు,
సర్వకర్మాణి = కర్మల నన్నిటిని,
సన్న్యస్య = విడిచిపెట్టి,
నైవకుర్వన్ = చేయనివాడై,
నకారయన్ = చేయించనివాడై,
సుఖం = సుఖముగా,
ఆస్తే = ఉన్నాడు.

తా. మనోబుద్ధీంద్రియ శరీరములు వశమునందుగల యోగి వివేకయుక్తమైన మనస్సుచేత, తొమ్మిది ద్వారములు గల పురమను శరీరమునందు, సమస్తకర్మలను విడిచిపెట్టి, తానుచేయక చేయించక, సుఖముగ ఉన్నాడు.

అమృతవాహిని :_

ఈశ్లోకములోకూడ భగవదర్పణబుద్ధితో కర్మలుచేసి సిద్ధిపొందిన యోగియొక్క మహిమనే ఇంకను కొనియాడుచున్నాడు పరమాత్మ.

ఆసక్తి విడిచి, ఫలాభిలాషారహితముగా భగవత్కైంకర్యరూపముగా భగవదర్పణబుద్ధితో కర్మచేసిన యోగియొక్క అంతఃకరణములోని సమస్తమైన మలములు, దోషములు, వాసనలు పూర్తిగ నశించి పరిపూర్ణ విశుద్ధిచెందగా,

రాగద్వేషములు కర్తృత్వాహంకారములు ఎంతమాత్రమును లేనిస్థితిలో ఆతని మనోబుద్ధీంద్రియ శరీరములు పరమ సాత్త్వికములై, పూర్తిగ అతని వశమందుండును. కనుక అతనికి 'వశీ' అను పదము ప్రయోగించబడినది. అతనికి యథార్థ జ్ఞానము ప్రకాశించును. ఆ స్థితిలో అతడు బాహ్యమునకు ఇతరుల దృష్టిలో కర్మకలాపములలో ఎంత మునితేగిలు చున్నట్లు కనబడినను, యథార్థమునకు అతడేమియు చేయుట లేదు. చేయించుటయును లేదు.

'నేను చేయుచున్నాను. చేయించుచున్నాను' అనుకొనుటకు అహంకారాభిమానాదులున్నగదా! అవి లేనప్పుడు అతని అంతఃకరణములో అట్టి వృత్తియేరాదు. అజ్ఞాని నిజముగా తాను చేయకపోయినను కర్తృత్వాహంకారాభిమానాదులతో, ఆ కర్మల నన్నిటిని తననెత్తిపై వేసికొని, బంధింపబడుచున్నాడు. యోగియో, యథార్థముగా తాను చేసినట్లు లోకులకు కనబడినను, తన పరిపూర్ణ పరిశుద్ధ సాత్త్వికాంతఃకరణములో యథార్థజ్ఞానము ప్రకాశించుటచే, దాని వలన కలిగిన వివేకముతో పరిపుష్టి చెందిన మనస్సుతో, కర్మల నన్నిటిని నవద్వారములతో కూడిన శరీరమునందు విడుచుచున్నాడు. ఎనిమిది తొమ్మిది శ్లోకములలో చెప్పినట్లు, ఇంద్రియములు, ప్రాణములు, మనస్సు, బుద్ధి మొదలగువాని వ్యాపారములే సమస్తకర్మలకును కారణమని తెలిసికొని, ఆ

కర్మలయందు కర్తృత్వాహంకారాదులు ఎంతమాత్రమును లేకయుండుటయే మనస్సుతో కర్మలనన్నిటిని శరీరమునందు విడుచుట అనబడును. అట్లు విడిచి పరమాత్మయందే సుఖముగ నివసించుచున్నాడు. ఇటువంటివానిని కర్మలు ఎట్లు అంట గలవు ? పరమశాంతికి తక్కువ ఏమి ఉండును ? ఆనందమో ఆనందము! అట్టివాడే కృష్ణునకు అభిమతమైనవాడు.

శ్లో॥ న కర్తృత్వం న కర్మాణి
లోకస్య సృజతి ప్రభుః ।
న కర్మ ఫల సంయోగం
స్వభావస్తు ప్రవర్తతే ॥ ౧౪

ప. వి :- న, కర్తృత్వం, న, కర్మాణి, లోకస్య, సృజతి, ప్రభుః, న, కర్మఫలసంయోగం, స్వభావః, తు, ప్రవర్తతే.

టీక :—

ప్రభుః = పరమాత్మ,
లోకస్య = లోకమునకు,
కర్తృత్వం = (ప్రత్యేకముగా ఒక) కర్తృత్వమును,
న (సృజతి) = కలుగజేయలేదు;
కర్మాణి = (ప్రత్యేకముగా) కర్మలను,
న (సృజతి) కలుగజేయలేదు;

కర్మఫలసంయోగం = కర్మలయొక్క ఫలముతో
(ఒక్కొక్కరికి ప్రత్యేకముగా)
సంబంధమును,
న సృజతి = కలుగజేయలేదు;
స్వభావస్తు = ప్రకృతియే,
ప్రవర్తతే = ప్రవర్తించుచున్నది (ఇట్టివన్నియు కలుగ
జేయుచున్నది).

తా. సకల జీవరాసులకునై కర్తృత్వమును, కర్మలను, కర్మఫల సంయోగమును పరమాత్మ సృజించలేదు. ఇదంతయును ప్రకృతియే - స్వభావమే - చేయుచున్నది.

అమృతవాహిని :_

లోకములో జీవులన్నియును, అనేక కర్మలు చేయుచు కర్తృత్వాహంకారమును పొందుచున్నవి. తాము చేయు కర్మలయొక్క ఫలమును అనుభవించుచున్నవి. ఇది ఎట్లు జరుగుచున్నది ఈ శ్లోకములో వివరింపబడినది.

పరమాత్మకు ఏ విధమైన పక్షపాతమును లేదు. రాగద్వేషములును లేవు. అందువలన ఈ వ్యక్తి ఈ కర్మయే చేయవలయును అని, ఎవరికిని ప్రత్యేకముగ స్వతంత్రముగ పరమాత్మ ఏర్పాటు చేయలేదు.

ఒకడు పాపము చేయుచున్నాడు; ఒకడు పుణ్యము చేయుచున్నాడు; ఒకడు కష్టములు, నష్టములు, దుఃఖములు అనుభవించుచున్నాడు; వేరొకడు సుఖములు, లాభములు, ఆనందము అనుభవించుచున్నాడు - ఏమియును హేతువు లేకయే. పనికట్టుకొని పరమాత్మ ఒకనిచేత పాపమును చేయించి, కష్టములు నష్టములు, దుఃఖములు అనుభవింప జేయుట, వేరొకనిచేత పుణ్యమును చేయించి సుఖములను, లాభములను, ఆనందమును అనుభవింపజేయుట, మరొకనిచేత పాపపుణ్యములను మిశ్రమముగ చేయించి, కష్టములు, నష్టములు, దుఃఖములు, సుఖములు, లాభములు, ఆనందము కలగలుపుగా అనుభవింపజేయుట ఎట్లు సంభవించును ? ఎన్నటికిని అట్లు జరుగదు. "సమోఽహం సర్వభూతేషు" అనిన పరమాత్మ అట్లు చేయురా ? ఆయనకు పక్షపాతము లేదే !

అయితే ఎవరు చేయుచున్నారు ? ఎవరివలన ఈ పాప పుణ్యములు జరుగుచున్నవి ? మానవుడు తాను చేయవద్దని ఎంత అనుకొన్నను బలవంతముగా జరుగుచున్నవే అని సందేహము కలుగవచ్చును. గీత మూడవ అధ్యాయములో అర్జునుడు ఇట్టి ప్రశ్నయే వేసినాడు - "అథ కేన ప్రయుక్తో ఽయం పాపం చరతి పూరుషః అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః" (3౬) 'కృష్ణా ! మానవుడు ఇష్టమున్నను లేకున్నను బలవంతముగా దేనిచేత ప్రేరేపింపబడి, పాపము చేయుచున్నాడో చెప్పుము.'

ఈ ప్రశ్నకును ఇక్కడ సందర్భమునకును సంబంధము లేకపోలేదు. అక్కడ దానికి కారణము కామము అని చెప్పినాడు పరమాత్మ. ఇక్కడ స్వభావము అని చెప్పినాడు.

స్వభావము అనగానేమి ? స్వభావమనినను ప్రకృతి యనినను ఒకటే. ఈ స్వభావము చాల బలమైనది. అందువలననే పరమాత్మ గీత మూడవ అధ్యాయములో "సదృశః చేష్టతే స్వస్యాః ప్రకృతే ర్జ్ఞానవానపి ప్రకృతిం యాంతి భూతాని నిగ్రహః కిం కరిష్యతి" (౩౩) 'తెలిసినవాడు కూడ తన పూర్వజన్మవాసనానుకూలముగనే లోకమునందు ప్రవర్తించుచున్నాడు. సకల ప్రాణులను తమ తమ ప్రకృతినే - స్వభావమునే - అనుసరించుచున్నవి. అట్లు వాసనలనే అంటిపెట్టుకొని నడచువారిని నిగ్రహ మేమి చేయుగలదు?' అనినాడు. అనగా ప్రకృతి - స్వభావము - అంత బలమైనది అని భావము

స్వభావము బలమైనదే, జయించుట కష్టసాధ్యమే; కాని అసాధ్యము కాదు. ఈ విషయము తెలిసికొని సాధకులు హెచ్చరిక కలిగి యుండవలయును.

ఈ శ్లోకములో కూడ అంతయు చేయునది స్వభావమే అని చెప్పినాడు. స్వభావమనగా ప్రకృతి సంబంధమైన వాసనయే. అనాది కాలమునుండి వచ్చుచున్నట్టిదియు, పూర్వా

పూర్వకర్మలచే కలిగిన దేవమనుష్యాది శరీరములుగా పరిణమించినట్టిదియు, ప్రకృతియొక్క సంసర్గముచే ఆ యా శరీరములయందు కలుగు ఆత్మాభిమానమువలన జనించునట్టిదియు అగు వాసన - ఈ వాసనయే ఇంతయును చేయుచున్నది. కాని అజ్ఞానులు ఇది గ్రహించలేక, తమచేత అన్నియును పరమాత్మయే చేయించుచున్నాడనియును, తమకీ కష్టములు పరమాత్మయే తెచ్చిపెట్టినాడనియును అందురు. ఈ తత్త్వము బాగుగ తెలిసినగాని, ఈ సంసారబంధములనుండి బయటపడు సక్రమమైన మార్గము తెలియలేరు; తెలిసిన తరువాత ప్రయత్నించనూలేరు. అందువలననే దయాస్వరూపుడైన భగవంతుడు మన హితముకోరి ఒక్కొక్క విషయమునే అనేక సందర్భములలో అనేక విధములుగ మనకు తెలుపుచున్నాడు. అంతియేగాని, "భగవంతుడు చేయడు; ఆయనకు పక్షపాతము లేదు; ఆత్మ అంతకంటె చేయదు; ప్రకృతివలననే అంతయును జరుగుచున్నది. ఆ ప్రకృతికి ఆత్మకు సంబంధము లేదు; కనుక ఆ పాపపుణ్యముల ఫలములు ఆత్మకు సంబంధించవు" అని అర్థము చెప్పరాదు.

శ్లో॥ నాదత్తే కస్యచి త్పాపం
నచైవ సుకృతం విభుః ।
అజ్ఞానే నావృతం జ్ఞానం
తేన ముహ్యంతి జంతవః ॥ ౧౫

ప. వి :—న, ఆదత్తే, కస్యచిత్, పాపం, న, చ, ఏవ, సుకృతం, విభుః, అజ్ఞానేన, అవృతం, జ్ఞానం, తేన, ముహ్యంతి, జంతవః.

టీక :—

విభుః = పరమాత్మ,
కస్యచిత్ = ఎవనియొక్కయును,
పాపం = పాపమును,
సుకృతం చ = పుణ్యమును కూడ,
నాదత్తే = స్వీకరించడు,
అజ్ఞానేన = అజ్ఞానముచేత,
జ్ఞానం = జ్ఞానము,
ఆవృతం కప్పబడియున్నది;
తేన = అందుచేత,
జంతవః = సకల జీవరాసులును,
ముహ్యంతి = మోహింపబడుచున్నవి.

తా. పరమాత్మ స్వతంత్రముగా ఎవనియొక్క పాపపుణ్యములతోను సంబంధము కలుగజేసుకొనడు. జ్ఞానము అజ్ఞానముచే కప్పబడినది. అందువలన సకల జీవులు మోహములో పడిపోవుచున్నవి.

అమృతవాహిని :—

ఈ శ్లోకములో ఎవరి పాప పుణ్యములతోను పరమాత్మకు ఏమియును సంబంధము లేదని వివరించుచున్నాడు.

పై శ్లోకములో, పరమాత్మ ఎవరిచేతను పుణ్యమునుగాని పాపమునుగాని చేయించుటలేదు. స్వతంత్రముగ, అహేతుకముగ, ఎవరిని ఏ ఫలములు అనుభవింపజేయుటలేదని చెప్పబడినది. కనుకనే ఎవరియొక్క పాపపుణ్యములతోను పరమాత్మకు ఎంతమాత్రమును సంబంధములేదు. ఆయనకు ఎంతమాత్రమును అంటవు కనుక ఆ పాపపుణ్యములయొక్క ఫలము ఆయన అనుభవించవలసిన అగత్యములేదు. ఎవరి పాపపుణ్యములు వారే చేయుచున్నారు. ఆ ఫలములను వారే అనుభవించుచున్నారు.

అయితే వారు ఎందుకు చేయవలయును ? మంచియే చేయవచ్చును గదా ! ప్రతివారును తమకు అహితమునే చేసికొనుచున్నారే !- నిజమే. సర్వులయొక్క జ్ఞానము అజ్ఞానముచేత కప్పబడినది. అందుచేత సర్వులును మోహములో పడిపోవుచున్నారు. ఆ కారణమున స్వస్వరూపజ్ఞానము మరుగుపడి, దేహమే తా ననెడి దేహాత్మాభిమానముచే, మరల మరల పాపపుణ్యములు చేయుచుండుట, వాటి ఫలములను అనుభవించుటకు అధోలోకములకు, ఊర్ధ్వలోకములకు పోవుట ఇక్లే మోహములోపడి కర్మలుచేయుట, వాటిని అనుభవించుటకై దేహములు ధరించుట, ఆ దేహములయందు ఆత్మాభిమానరూపమైన మోహము పొందుట, దానివలన మరల దాని కనుగుణమైన కర్మలయొక్క వాసన ఉత్పన్నమగుట, ఆ

వాసనచేత మగల కర్మలు చేయుట, వాటియొక్క ఫలరూప మైన శరీరములు, మగల వాటియందు ఆత్మాభిమానము - ఇట్లే అంతులేనంత వాసనాపరంపర ప్రవాహముగా పెరిగి పోవును. జ్ఞానము అజ్ఞానముచే కప్పబడియుండుటచే ఈ విధముగ జీవనము నాయను మోహసముద్రములో మునిగి పోవుచున్నది.

శ్లో॥ జ్ఞానేన తు త దజ్ఞానం
యేషాం నాశిత మాత్మనః ।
తేషా మాదిత్యవత్ జ్ఞానం
ప్రకాశయతి తత్పరమ్ ॥ ౧౬

ప. వి :—జ్ఞానేన, తు, తత్, అజ్ఞానం, ఏషాం, నాశితం, ఆత్మనః, తేషాం, ఆదిత్యవత్, జ్ఞానం, ప్రకాశయతి, తత్పరమ్.

టీక :—

తు = కాని,
ఏషాం = ఎవరియొక్క,
తదజ్ఞానం = ఆ అజ్ఞానము,
ఆత్మనః = పరమాత్మకు సంబంధించిన,
జ్ఞానేన = జ్ఞానముచేత,
నాశితం = నశించిపోయినదో,
తేషాం = వారియొక్క,

జ్ఞానం = జ్ఞానము,
ఆదిత్యవత్ = సూర్యునివలె,
తత్పరం = సచ్చిదానందఘన పరమాత్మ తత్త్వమును,
ప్రకాశయతి = ప్రకాశింపజేయుచున్నది.

తా. కాని, ఎవరియొక్క ఆ అజ్ఞానము భగవత్సంబంధమైన జ్ఞానముచే నశించిపోయినదో, వారియొక్క జ్ఞానము సూర్యునివలె పరమాత్మ యొక్క యథార్థస్వరూపమును ప్రకాశింప చేయుచున్నది.

అ మృ త వా హి ని :—

సకల జీవులయొక్క జ్ఞానము అజ్ఞానముచే కప్పబడియున్నదని పై శ్లోకములో చెప్పబడియున్నది. అయితే, ఆ అజ్ఞానముచే కప్పబడియున్న జ్ఞానము ఎట్లు మనకు ఉపయోగములోనికి వచ్చుట అను ప్రశ్నకు సమాధానము చెప్పబడుచున్నది ఈ శ్లోకములో. భగవత్సంబంధమైన జ్ఞానములో ఆ అజ్ఞానము నశించిపోయినచో, అడ్డముగా కప్పబడిన మేఘములు పోగా సూర్యుడు జగత్తును ప్రకాశింపజేసినట్లు, ఆ జ్ఞానము పరమాత్మ తత్త్వమును ఉన్నదున్నట్లు ప్రకాశింపజేయును.

•

అయితే జ్ఞానము అజ్ఞానముచేత కప్పబడియున్నదికదా! కప్పియున్న అజ్ఞానము జ్ఞానముచేత నశించిపోవలయుననిన, ఆ జ్ఞానము ఏది? కప్పబడియున్న లోపలి జ్ఞానమా? ఆ జ్ఞానమే

అయినచో, ఆ జ్ఞానము ఎప్పుడును ఉంటనే ఉన్నది. అదియే కప్పియున్న అజ్ఞానమును నశింపజేయునెడల అజ్ఞానము దానిని మొదటనే కప్పలేకపోయెడిది. కప్పగలిగినదిగదా! ఇప్పుడు ఎట్లైన మనము ఆ అజ్ఞానము అను కప్పును తొలగించుకొనిన యెడల ఆ జ్ఞానము ఇక తన ప్రభావమును చూపగలదు.

మహాప్రకాశముగల దీపము, పైన మట్టికుండచేత కప్పబడి యున్నది. లోపల ఉన్న దీపము అపరమిత ప్రకాశము గలదే. కాని అది మనకు ఉపయోగపడవలయుననిన పైకుండను ఏదో రూపమున తొలగించవలయును.

ఇప్పుడు జ్ఞానమును కప్పిన అజ్ఞానమును జ్ఞానముతోనే నశింపజేయవలయును. అనగా కప్పబడియున్న జ్ఞానము వేరు, కప్పిన అజ్ఞానమును నశింపజేయు జ్ఞానము వేరు అని తలంచవలయును. అజ్ఞానమును నశింపజేయు జ్ఞానమేది ?

పదమూడవ అధ్యాయములో -

"అమానిత్వ మందభిత్వ మహింసా క్షాంతి రార్జవమ్ ।
ఆచార్యోపాసనం శౌచం స్థైర్య మాత్మవినిగ్రహః ॥"
(13-7)

"ఇంద్రియార్థేషు వైరాగ్య మనహంకార ఏవచ ।
జన్మ మృత్యు జరా వ్యాధి దుఃఖ దోషానుదర్శనమ్ ॥"
(13-8)

"అసక్తి రనభిష్వంగః పుత్ర దార గృహాదిషు ।
నిత్యంచ సమచిత్తత్వ మిష్టానిష్టోపపత్తిషు ॥" (13-9)

"మయి చానన్యయోగేన భక్తి రవ్యభిచారిణీ ।
వివిక్త దేశసేవిత్వ మరతి ర్జనసంసది ॥" (13-10)

"అధ్యాత్మజ్ఞాన నిత్యత్వం తత్త్వ జ్ఞానార్థ దర్శనమ్।
ఏతత్ జ్ఞానమితి ప్రోక్త మజ్ఞానం యదతోఽన్యథా ॥" (13-11)

'గౌరవమును కోరకుండుట, దంభము లేకుండుట' అహింస, ఓర్పు, మనోవాక్కాయములయందు ఏకవిధముగా ఉండుట, గురుసేవ, శుచిత్వము, స్థైర్యము, మనోనిగ్రహము, ఇంద్రియ విషయములందు వైరాగ్యము, అహంకారము లేకుండుట, జన్మము - మృత్యువు - ముసలితనము - వ్యాధి మొదలగువాటియందలి దుఃఖములను, దోషములను విచారించుకొనుట, సక్తత లేకుండుట, దారా పుత్ర గృహాదుల యందు లంపటుడు కాకుండుట, ఇష్టానిష్టములు ప్రాప్తించినప్పుడు చిత్తమును చలించనీయక సమముగ ఉండుట, పరమాత్మయందు అనన్యభావముతో చలించని భక్తి కలిగి యుండుట, పవిత్రమును, ఏకాంతమును అయిన ప్రదేశమునందు ఉండుట, సాంసారి జనులతో కలిసి ఉండకపోవుట, గురువు వద్ద శ్రవణముచేసిన ఆత్మానాత్మవివేకమునందే స్థిరముగ నిలిచి యుండుట, తత్త్వజ్ఞానమునకు ఫలమైన పరమాత్మను

సదా చింతించుకొనుట - ఇది జ్ఞానమని చెప్పబడుచున్నది - అనిఉన్నది. ఇక్కడ చెప్పబడినట్లు ఆచరణయందు ఉంచుకొన్న యెడల కప్పబడియున్న అజ్ఞానము నశించి జ్ఞానము ప్రకాశించును కనుక - యధార్థ జ్ఞాన సాధనము గనుక - దీనిని కూడ జ్ఞానమనియే చెప్పిరి. ఈ జ్ఞానముచేత అజ్ఞానమును నశింపజేసికొనవలయును. అప్పుడు లోపలఉన్న జ్ఞానము సూర్యునివలె ప్రకాశించి, భగవద్దర్శనము లభింపజేయును.

"ఆదిత్యవత్ జ్ఞానం - ప్రకాశయతి తత్పరమ్".

అనగా సూర్యుడు వచ్చుటచేత సకలపదార్థములు ఎట్లు ప్రకాశించుచున్నవో, అట్లే ఈ జ్ఞానము లభించుటచే భగవత్తత్త్వము ఉన్నదున్నట్లు మనకు గోచరించును.

శ్లో॥ తద్బుద్ధయ స్తదాత్మాన
స్తన్నిష్ఠా స్తత్పరాయణాః ।
గచ్ఛంత్యపునరావృత్తిం
జ్ఞాన నిర్ధూత కల్మషాః ॥ ౧౭

ప. వి :- తద్బుద్ధయః, తదాత్మానః, తన్నిష్ఠాః, తత్పరాయణాః, గచ్ఛంతి, అపునరావృత్తిం, జ్ఞాననిర్ధూత కల్మషాః.

టీక :—

తద్బుద్ధయః = ఆ పరమార్థతత్త్వమునందే బుద్ధి గలట్టియును,

తదాత్మానః = దానియందే మనస్సు లగ్నమై
నట్టియును,

తన్నిష్ఠాః = దానియందే నిష్ఠగలట్టియును.

తత్పరాయణాః = ఆ పరమార్థతత్త్వమే ఆశ్రయ
ముగా కలవారు,

జ్ఞాననిర్ధూతకల్మషాః (సంతః)=జ్ఞానముచే పోగొట్టబడిన
పాపముకలవారై,

అపునరావృత్తిం = పరమపదమును,

గచ్ఛంతి = పొందుచున్నారు.

తా. పరమార్థ తత్త్వమునందే దృఢాధ్యవసాయము కలిగిన బుద్ధి గలట్టియును, లగ్నమైన మనస్సుగలట్టియును, నిష్ఠగలట్టియును, పరమార్థ తత్త్వమే ఆశ్రయముగా గల సాధుపురుషులు, జ్ఞానముచేత తమ పాపములన్నియు నిశ్శేషముగా నశించగా. పరమపదమును పొందు చున్నారు.

అ మృ త వా హి ని :—

అట్టి జ్ఞానము సూర్యునివలె, పరమాత్మ తత్త్వమును ప్రకాశింపచేయగా, ఆ పరమాత్మ తత్త్వమును సాక్షాత్కరింప చేసికొనిన మహాత్ములను ఈశ్లోకములో వర్ణించి చెప్పు చున్నాడు. వారియొక్కబుద్ధి కేవలము పరమాత్మ తత్త్వము నందే నిశ్చయాత్మకమై సంచరించుచుండును. సకల చరాచర ప్రపంచమును వ్యాపించి సకల జీవసముదాయముల యొక్క

హృదయసీమల నిల్చియున్న వాత్సల్య సౌశీల్య సౌలభ్య జ్ఞాన శక్త్యాదికల్యాణగుణమహోదధియును, ప్రేమమయుడును, ఆనందమయుడును, సర్వజ్ఞుడును, సర్వశక్తిమంతుడును, సర్వోత్తముడును, సకలలోకశరణ్యుడు నైన భగవంతునియొక్క గుణ ప్రభావ లీలావైభవములయొక్క తత్త్వమును సరహస్యముగా సంశయ విపర్యయరహితముగా తెలిసికొని, సదా, సర్వదా, సర్వత్ర అచంచలమైన నిశ్చయము కలిగి యుండుట వారి లక్షణము. వారియొక్క మనస్సు ప్రేమామృత మహాబ్ధి - పురుషోత్తముడు - అయిన భగవంతునికంటె ఇతరమైన సమస్త విషయముల నుండి పూర్తిగ విరక్తిచెంది, ఆయనయందే తన్మయమై సదా సర్వదా ఆయననే చింతించుకొనుచుండును.

వారు అట్టి సచ్చిదానందఘనునియందే స్థిరముగనిలిచి యుందురు. వారికి ఆ పరమాత్మయే పరమగతి. పరమాశ్రయము. జ్ఞానమును కప్పియున్న అజ్ఞానము సమూలముగ నశించిపోవుటచేత జ్ఞానము ప్రకాశించగా బంధనకారణములైన శుభాశుభ కర్మలును, రాగద్వేషాది దుర్గుణములును, విక్షేపము, ఆవరణము మొదలగు దోషములును అన్నియును పూర్తిగ తొలగిపోయినవారు. వీరు మరల తిరిగిరాని పరమ పదమునకు అధికారులగుచున్నారు.

అవతారిక :-

ఇక అట్టి మహాత్ములయొక్క సమత్వమును చెప్పుచున్నాడు.

శ్లో॥ విద్యావినయసంపన్నే
బ్రాహ్మణే గవి హస్తిని ।
శుని చైవ శ్వపాకేచ
పండితా స్సమదర్శినః ॥ ౧౮

ప. వి :- -విద్యావినయ సంపన్నే, బ్రాహ్మణే, గవి, హస్తిని, శుని, చ, ఏవ, శ్వపాకే, చ, పండితాః, సమదర్శినః.

టీక :—

విద్యా వినయ సంపన్నే=విద్యయును, వినయమునుగల,
బ్రాహ్మణే = బ్రాహ్మణునియందును,
గవి = ఆవునందును,
హస్తిని = ఏనుగునందును,
శునిచ = కుక్కయందును,
శ్వపాకేచ = కుక్కను వండుకొని తిను చండాలుని యందునుకూడ,
పండితాః = పండితులు,
సమదర్శినః = సమమైన దృష్టిగలవారుగ ఉందురు.

తా. పండితులైన వారియొక్క దృష్టి విద్యావినయ సంపన్నులైన బ్రాహ్మణునియందును, ఆవునందును, ఏనుగునందును. కుక్కయందును, ఛండాలునియంధును సమముగనే ఉంధును.

అమృతవాహిని :-

పండితు లనగా ఎవరో విచారణ చేయవలసి యున్నది. పండితశబ్దమునకు "యేషాం జ్ఞానేన నాశిత మాత్మనః అజ్ఞానం తే పండితాః" 'ఎవరియొక్క అంతఃకరణమునందలి అజ్ఞానము జ్ఞానముచేత నశించినదో వారు పండితులు' అని శంకరాచార్యులవారును, "సమదర్శిత్వమేవ పాండిత్యం" 'సమదర్శిత్వమే పాండిత్యము' అని ఆనందతీర్థులును, "పండితాః ఆత్మ యాథాత్మ్యవిదః" 'ఆత్మయొక్క యథార్థ స్వరూపమును తెలిసినవారు పండితులు' అని రామానుజులును, "యేషాం జ్ఞానేన నాశిత మాత్మనః అజ్ఞానం తే పండితాః" అని హనుమంతుడును, "పండితా స్తత్వ యాథాత్మ్యవిదః" 'తత్త్వము యొక్క యథార్థ స్వరూపము తెలిసినవారు పండితులు' అని కేశవ కాశ్మీరభట్టాచార్యులును, "పండితాః జ్ఞానినః" 'పండితు లనగా జ్ఞానులు' అని మధుసూదన సరస్వతులను నిర్వచనము చేసియున్నారు.

సచ్చిదానందఘన పరబ్రహ్మముయొక్క యథార్థ తత్త్వమును బాగుగ అనుభవరూపముగ తెలిసినవారే సిద్ధ పురుషులు, మహాత్ములు. విద్యా వినయ సంపన్నుడైన బ్రాహ్మణునియందును, పరమపవిత్ర జంతువైన ఆవునందును, ఏనుగునందును, కుక్కయందును, చండాలుని యందును సమబుద్ధి కలిగియుండుట వారి లక్షణము. పండితులను గుర్తించు

టకు ఇదే ఆధారము. మానవులలో ఉత్తమోత్తము డైన బ్రాహ్మణుని, చండాలుని, పశువులలో ఉత్తమోత్తమమైన గోవును, మధ్యమ తరగతికి చెందిన ఏనుగును, నీచమైన కుక్కను ఉదాహరణముగ చూపించి పండితుల యొక్క సమదర్శిత్వమును మచ్చుకు చూపించుటయైనది. ఈ విధముగ సకల జీవులయందును వారు సమదర్శులుగ ఉందురు.

వారియొక్క సమదర్శిత్వము వ్యవహారమునందు కని పెట్టుట ఎట్లు? సర్వత్ర వ్యవహారము ఒకేవిధముగ ఉండునా? అట్లుండదు. సమత్వము భావమునకు సంబంధించినదిగాని, బాహ్యమైన కర్మకు సంబంధించినది కాదు. ఒకరియందు తక్కువభావము, ఒకరియందు ఎక్కువభావము లేకుండ వారి ప్రేమ సర్వత్ర సమముగా నుండును. ఆకలితో తనచోటునకు వచ్చినవారిని, మీరు బ్రాహ్మణులా, క్షత్రియులా, వైశ్యులా, శూద్రులా, చండాలురా - ఈ మొదలగు ఆలోచనలులేక, ఎవరైనను సరియే ప్రేమతో ఆదరణముతో భోజనము పెట్టును. తనవారైన ప్రేమతో ఆదరణముతో పెట్టుట, లేని యెడల ఎందుకు వచ్చినదిరా అని విసుగుగొనుచు పెట్టుట ఉండదు. తనకు చేతనైన సాహాయ్యము చేయుటలో, దుఃఖ నివారణచేయుటలో, మానవులని, జంతువులని, మానవులలో బ్రాహ్మణుడని, చండాలుడని, జంతువులలోకూడ ఆవు అని, కుక్కఅని భేదమెంచకుండ, అన్నిటియొక్క అవసరములు తీ

యున్నంతవరకు నెరవేర్చుటయే. ఆ అవసరములు నెరవేర్చుట కూడ వారికి హితముకలుగుట, వాటికి ఉపయోగపడుటను దృష్టిలో ఉంచుకొనియే చేయును. అందువలన పైకి క్రియారూపములో మాత్రము భేదము కనుపడుచునే యుండును. ఆకలియైన మానవుడువచ్చిన అన్నము పెట్టును. ఆవు వచ్చిన గడ్డి, జనపకట్ట మొదలగునవి వేయును. అంతేగాని, 'నేను సమదర్శిని. నాకు అన్నియు సమానమే' అని మానవునకును, ఆవునకునుకూడ అన్నమే పెట్టుటయో, లేక గడ్డి, జనుపకట్ట వేయుటయో చేయడు. అట్లే ఈయన సమదర్శి అయిన, మానవునకు అన్నము, ఆవుకు గడ్డి జనుపకట్ట వేయునేమి అనియును, ఈయనకు ఈ భేదము ఎందుకు అనియును, ఈ భేదము ఉన్నవాడు సమదర్శి ఎట్లు అగును అనియును తలంచరాదు. ఇట్లే అన్నివైపులనుండియును, అన్నివిషయములలోను అని తెలిసికొనవలయును.

ఇది బాహ్యమైన వ్యవహారము విషయము.

ఇంకొకవిధముగకూడ సమదర్శిత్వమును విచారణ చేయవలయును.

పరమాత్మ సకలభూతములయందును లోపల బయట కూడ వ్యాపించి యున్నాడు. వారు ఆ పరమాత్మను సర్వత్ర సమముగా చూతురు. ప్రాపంచికదృష్టిలో ఇది పవిత్రమైన

వస్తువు, ఇది అపవిత్రమైన వస్తువు, ఇది ఉత్తమమైనది; ఇది నీచమైనది, అందుచే పరమాత్మ ఈ వస్తువులలో ఎక్కువగ వ్యాపించి ఉండును. ఈ వస్తువులలో తక్కువగ వ్యాపించి ఉండును అని అనుకొనక, అన్నిటియందును, మానవులలో ఉత్తమోత్తముడైన బ్రాహ్మణునియందును, నీచాతినీచుడుగ భావింపబడు చండాలుని యందును, పశువులలో ఉత్తమమైన ఆవునందును, మధ్యమమైన ఏనుగునందును, నీచమైన కుక్కయందునుకూడ సమముగానే పరమాత్మ వ్యాపించియుండుటను వారు చూచుచుందురు. కాన సర్వత్ర సమముగ వ్యాపించి యున్న పరమాత్మను చూతురు. ఇట్టివారిని గురించియే "వాసుదేవ స్సర్వమితి స మహాత్మా సుదుర్లభః" అని గీతలో చెప్పబడినది. కనుక అట్టి మహాపురుషులకు సర్వత్ర పరమాత్మదృష్టి ఉండుటచేత సర్వత్ర సమదృష్టి సహజమైపోవును. సర్వత్ర సమదృష్టి సహజమైపోయినప్పటికిని, లోకదృష్టితో వ్యవహారమునందు యథాయోగ్యమైన భేదము ఉండనే ఉండును. వ్యవహారములో భేదమున్నను పరమార్థదృష్టిలో సమత్వమునకు ఎంతమాత్రమును అడ్డు లేదు. కనుక, ఇట్టి తత్త్వజ్ఞానులైన మహాపురుషులు వ్యవహార దృష్టిలో జీవసముదాయమునకుగాని జీవికిగాని విపత్తు కలిగినప్పుడు; భేదభావము ఎంతమాత్రమును లేకుండ ఆ విపత్తును నివారణ చేయుటకు యథాశక్తి యథాయోగ్యముగా ప్రయత్నించుదురు.

అంతేగాక, సమః అనగా పరమాత్మ. అందరియందు సర్వత్ర పరమాత్మనే చూచువాడు సమదర్శి. ఇట్టి సమదర్శియే పండితుడు.

శ్లో॥ ఇహైవ తైర్జిత స్సర్గో
యేషాం సామ్యే స్థితం మనః ।
నిర్దోషం హి సమం బ్రహ్మ
తస్మాద్బ్రహ్మణి తే స్థితాః ॥ ౧౯

ప. వి :—ఇహ, ఏవ, తైః, జితః, సర్గః, యేషాం, సామ్యే, స్థితం, మనః, నిర్దోషం, హి, సమం, బ్రహ్మ, తస్మాత్, బ్రహ్మణి, తే, స్థితాః.

టీక :—

ఏషాం = ఎవరియొక్క,
మనః = మనస్సు,
సామ్యే = సమత్వమునందు,
స్థితం = నిలిచియున్నదో,
తైః = వారిచేత,
ఇహైవ = ఇక్కడనే,
సర్గః = సంసారమును,
జితః = జయించబడినది;

(9)

హి = ఎందుల కనగా,
బ్రహ్మ = పరబ్రహ్మము,
నిర్దోషం = దోషరహితమైనదియును,
సమం = సమముగా నుండునదియును,
తస్మాత్ = కాబట్టి,
బ్రహ్మణి = పరబ్రహ్మమునందు,
తే = వారు,
స్థితాః = నిలిచియున్నారు.

తా. ఎవరియొక్క మనస్సు సమత్వమునందే నిలిచియున్నదో, వారిచేత బంధనరూపమైన ఈ సంసారము ఇక్కడనే జయించబడినది. కారణమేమనగా - పరబ్రహ్మ వస్తువు ఎంతమాత్రమును దోషములు లేనిది, సమస్తమునందును సమముగా నుండునది కాన, సమదర్శులైన వారు ఆ పరబ్రహ్మమునందే స్థిరముగా నిలిచియుందురు.

అ మృ త వా హి ని :-

ఈ శ్లోకములో కూడ సమదర్శులైనవారి వైభవమే చెప్పబడినది.

"విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ! శునిచైవ శ్వపాకేచ పండితా స్సమదర్శినః ॥" అని చెప్పిన ప్రకారముగా సర్వభూతములందును సమభావము కలిగిన మహాత్ములు ఇక్కడనే సంసారబంధనములను త్రెంచు

కున్నారు. అనగా ప్రారబ్ధకర్మరీత్యా వారి శరీరమునకు ఇంకను ఆయుష్కాలము మిగిలియుండుటచేత, ఈ లోకములో వారున్నను ముక్తులే. సంసార బంధనము లేమియును వారికి లేవు. సర్వత్ర వారికి పరమాత్మానుభవము ఉండనే ఉన్నది. ఇంక వారికి ముక్తదశ కాక మరేమి ? వారు చేపట్టిన వస్తు వెట్టిది ? "నిర్దోషం హి సమం బ్రహ్మ" ఆ పరబ్రహ్మతత్త్వము దోష రహితమైనది. సత్త్వ రజ స్తమో గుణములుగాని, వాటికి సంబంధించిన రాగద్వేషములుగాని, రాగద్వేషములకు సంబంధించిన విషమత్వముగాని లేనిది ఆ పరబ్రహ్మతత్త్వము. "సర్వేభ్యః పాపేభ్య ఉదితః" 'సకల పాపములకు అతీతమైనది' (ఛాందోగ్యోపనిషత్), "ఏష ఆత్మా అపహతపాప్మా విరజో విమృత్యు ర్విశోకో విజిఘ త్సోఽపిపాసః" (ఛాం - ఉ - 8-1-15) 'ఈ పరమాత్మ పుణ్యపాపములు, జరామృత్యువులు లేనివాడు. శోకరహితుడు. ఆకలిదప్పులు లేనివాడు' అని శ్రుతి చెప్పుచున్నది. కనుక పరబ్రహ్మవస్తువు నిర్దోషమైనది. భగవంతుడు అఖిలహేయ ప్రత్యనీకుడు. అంతమాత్రమే కాక సకల కల్యాణగుణ మహోదధి. సత్యకాముడు. సత్యసంకల్పుడు. సర్వేశ్వరేశ్వరుడు. అట్టి పరబ్రహ్మమునందు సదా నిలిచి యుండువారు గనుక, మహాత్ములుకూడ నిర్దోషులు. వారు కూడ సత్త్వ రజ స్తమోగుణముల కతీతులై ఉందురు. కనుకనే వారికికూడ రాగద్వేషాదులుగాని, విషమబుద్ధిగాని లేక, సమత్వము వారికి సహజమైపోవును.

అ వ తా రి క :-

ఇంకను అట్టి మహాత్ముల లక్షణము చెప్పుచున్నాడు.

శ్లో॥ న ప్రహృష్యే త్ప్రియం ప్రాప్య
నోద్విజే త్ప్రాప్య చాప్రియమ్ ।
స్థిరబుద్ధి రసమ్మూఢో
బ్రహ్మవి ద్బ్రహ్మణి స్థితః ॥ ౨౦

ప వి :—న, ప్రహృష్యేత్, ప్రియం, ప్రాప్య, న, ఉద్విజేత్, ప్రాప్య, చ, అప్రియం, స్థిరబుద్ధిః, అసమ్మూఢః, బ్రహ్మవిత్, బ్రహ్మణి, స్థితః.

టీక :—

స్థిరబుద్ధిః = పరమాత్మయందే స్థిరమైన బుద్ధి కలిగినట్టియు,

అసమ్మూఢః = సంశయము, భ్రమ, మోహము ఎంత మాత్రమును లేనట్టియు,

బ్రహ్మణి స్థితః = సర్వకాల సర్వావస్థలయందును పరమాత్మయందే త్రికరణములచేతను నిలిచి ఉండునట్టియు,

బ్రహ్మవిత్ = పరమాత్మానుభవము కలవాడు,

ప్రియం = ఇష్టమైనదానిని,

ప్రాప్య = పొంది,
న ప్రహృష్యేత్ = సంతోషించడు,
అప్రియం ప్రాప్యచ = అనిష్టమైనదానిని పొందికూడ,
నోద్విజేత్ = దుఃఖించడు.

తా. స్థిరబుద్ధి కలవాడును, సంశయము, భ్రమ, మోహము - ఇవి ఎంతమాత్రమును లేనివాడును, సర్వకాల సర్వావస్థల యందును పరమాత్మయందే త్రికరణములచేతను నిలిచియుండువాడును, భగవదనుభవ పరుడును అగు మహాత్ముడు లోకములో ఇష్టములభించినప్పుడు సంతోషించుట, అనిష్టము లభించినప్పుడు దుఃఖించుట చేయడు.

అమృతవాహిని :-

పరమాత్మప్రాప్తస్థితిని పొందిన మహాత్ముల లక్షణములు చెప్పబడుచున్నవి. భగవదనుభవపరులైన మహాత్ములు జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలలోను, భూత భవిష్య ద్వర్తమాన కాలములలోనుకూడ కాయేన మనసా వాచా భగవంతుని యందే నిలిచియుందురు. అట్టి మహాత్ములను గుర్తుపట్టుట ఎట్లో చెప్పుచున్నాడు. వారిబుద్ధి అన్ని అవస్థలలోను, అన్ని పరిస్థితులలోనుకూడ స్థిరమైనగా ఉండును. ఏపరిస్థితియుకూడ వారి బుద్ధిని చలింపచేయలేదు. వారియొక్క అంతఃకరణములో సంశయములుగాని, భ్రమగాని, మోహముగాని ఈషణ్మాత్రము కూడ ఉండవు. వారికి వాసనలు, కాంక్షలు నశించినవి. ఆకారణమున, వారికి ఇష్టానిష్టములన్నవి లేనేలేవు. లోక

ధర్మమునననుసరించి చూచినను ఇష్టము లభించినప్పుడు సంతో షించరు. అనిష్టము లభించినప్పుడు దుఃఖించరు. ప్రారబ్ధ కర్మానుసారముగ ఏది లభించిన దానినే నిర్లిప్తతతో "యద్య ద్భవ్యం భవతు భగవన్ పూర్వకర్మానురూపం" అని ఉందురు.

శ్లో॥ బాహ్యస్పర్శే ష్వసక్తాత్మా
విందత్యాత్మని యత్సుఖమ్ ।
స బ్రహ్మయోగయుక్తాత్మా
సుఖ మక్షయ మశ్నుతే ॥ ౨౧

ప. వి :— బాహ్యస్పర్శేషు, అసక్తాత్మా, విందతి, ఆత్మని, యత్, సుఖమ్, సః, బ్రహ్మయోగయుక్తాత్మా, సుఖం, అక్షయం, అశ్నుతే.

టీక :—

బాహ్యస్పర్శేషు = బాహ్యవిషయములయందు,
అసక్తాత్మా = ఆసక్తిలేని అంతఃకరణము కలవాడు,
ఆత్మని = అంతఃకరణమునందు,
యత్సుఖం = ఏ సుఖమును - భగవద్ధ్యానమువలన కలిగిన ఏ సుఖమును -
విందతి = పొందుచున్నాడో,
సః = వాడు,

బ్రహ్మయోగయుక్తాత్మా = సచ్చిదానందఘన పరబ్రహ్మమునందలి ధ్యానయోగమునందే నిలుకడ కలిగిన మనస్సు కలిగినవాడై,

అక్షయం = నాశరహితమైన,

సుఖం = ఆనందమును,

అశ్నుతే = అనుభవించుచున్నాడు.

తా. బాహ్యవిషయములయందు ఆసక్తిలేని మనస్సు కలవాడు, అంతఃకరణమునందు ధ్యానమువలన కలిగిన ఆనందమును పొందుచున్నాడు. తరువాత వాడు పరబ్రహ్మధ్యానమునందే నిలుకడకలిగిన మనస్సుకలవాడై, అంతములేని ఆనందమును అనుభవించుచున్నాడు.

అమృతవాహిని :-

సాధకుడు పరమాత్మధ్యానము చేసికొనుచున్నను బాహ్యవిషయములయందు అనగా ప్రాపంచిక భోగములయందు ఆసక్తి ఉన్నంతకాలము, ఆ ధ్యానమువలన కలుగవలసిన ఉన్నతి కలుగదు. కనుక బాహ్యవిషయములయందు ఆసక్తి పూర్తిగ పోవలయును. అప్పుడు భగవద్ధ్యానమువలన అంతఃకరణములో ఒకరకమైన సాత్త్వికానందము కలుగును. ఆ ఆనందము అనుభవమునకు వచ్చుటతోడనే ఇక మనస్సును

బాహ్యవిషయములమీదికి పోనీయకుండ ఆపవలసిన కష్టము ఉండదు. ఆ సుఖమును మరిగిన మనస్సు సహజముగనే భగవద్ధ్యానమునందు మగ్నమగును. మనస్సు ఆ పరబ్రహ్మ ధ్యానమునందే స్థిరముగా నిలుకడ చెందినంతనే అతడు నాశనములేని - అనగా శాశ్వతమైన - బ్రహ్మానందమును అనుభవించును.

ఈ శ్లోకములో సాధకునికి గొప్ప హెచ్చరిక కలదు. సాధకుడు ప్రాపంచిక భోగములయందు వైరాగ్యమును కలిగియుండవలయును. మనస్సులో ఆసక్తి ఉండును. దానిని సాధకుడు గ్రహించలేక, తన మనస్సును నమ్మి సాధన సాగించుకొనుచుపోవును. మనస్సులో ఆ ఆసక్తి నెమ్మది నెమ్మదిగా, సాధకునకు తెలియకుండగనే, వృద్ధిని చెందుచుండును. ఆధ్యాత్మికసాధనలో ఎంతోపైకిపోతినను కొనువాడు సైతము ఎప్పుడో ఒకప్పుడు అకస్మాత్తుగా క్రిందకు కూలుట జరుగుచుండుటకు ఆసక్తియే కారణము. అందువలన సాధకుడు ప్రతిక్షణమును ఎంతో హెచ్చరిక కలిగి సాధన రంగములో ముందుకు నడక సాగించవలయును. లేనియెడల, సమయముకొరకు వేచియుండి, ఏ కునుకుపాటు సమయము లోనో, దాగియున్న ఆ ఆసక్తి అను పెద్దపాము ఒక్కసారి కాటు అందుకొనును.

ఒకొక్కవ్యాధి పైకి తెలియకుండ, లోలోపలనే వృద్ధిచెంది, మానవుని ఒక్కసారిగా ప్రమాదావస్థలోనికి

తెచ్చును. అట్టిది ఆసక్తి. ఎక్కడను మట్టి దొరకని పెద్దపెద్ద రాతిభవనములలోకూడ మొలిచి, ఎన్నిసారులు పెరికి పార వైచినను, అక్కడనే మెల్లిమెల్లిగా సారమును గ్రహించి వృద్ధిపొందెడు రావి, మఱ్ఱి వృక్షములవంటిది ఆసక్తి. బ్రహ్మ లోక భోగములయందు సైతము మహావైరాగ్యము కల వారము అనుకొని పట్టుదలతో సాధనచేయువారియొక్క, ఏమి యును తడిలేని, శుష్కమైన అంతఃకరణములలోకూడ ఈ ఆసక్తి తెలియకుండ సారమును గ్రహించి వృద్ధిపొందు చుండును. విషయోపభోగములు అను ఆహారమీయకుండ ఉపవాసములతో ఎంత శుష్కింపచేసినను, ఆ ఆసక్తి అంతః కరణములోని స్వల్పాతిస్వల్పములైన సందులనే ఆధారముగ చేసికొని వృద్ధిపొందుచునే ఉండును. కనుక సాధకుడు చాల హెచ్చరిక కలిగి ఉండవలయును.

విషయములను అంతఃకరణము ఎంతమాత్రము స్మరించి నను, అది ఆసక్తికి సారవంతమైన ఆహారమే. సాధకునకు తెలియకుండ విషయస్మరణము జరుగుచుండును. పరమ వైరాగ్యమున్నదనుకొనువాడు కూడ, ప్రతిక్షణము చిన్నిచిన్ని విషయములనుకూడ ఎట్లు స్మరించుచుండునో చూడుడు. పండుకొనుటకు ఈరోజు సౌకర్యములేదే అను భావము కలిగిన దనుకొనుడు- ఆ భావము, దాగి బలహీనముగా ఉన్న ఆసక్తికి ఒక బలవర్ధకమైన దివ్యౌషధమువలె బలమిచ్చును. తనకు

గౌరవము లభించవలయును అను భావము అంతకంటెను బలకరము. ఇట్టివి సాధకునకు తెలియకుండ అంతఃకరణములో ప్రతిక్షణమును బయలుదేరుచునే ఉండును. ఇట్లు చక్కగ తనను తాను పోషించుకొనుచు తెగబలియును ఆసక్తి. సమయముకొరకు వేచి, అవకాశము వచ్చినప్పుడు తలక్రిందులుగా పడద్రోయగలదు.

ఈ సందర్భమునే ఇంకొకరకముగా రెండవ అధ్యాయములో ఏబది తొమ్మిదవ శ్లోకములో హెచ్చరిక ఇచ్చియున్నాడు పరమాత్మ.

కనుక ఏనాటికి అంతఃకరణములో ఆసక్తి పూర్తిగ నశించిపోవునో, లేక ఇక బ్రతికిబట్టగట్టని స్థితికి బలహీనమైపోవునో, అప్పుడు ధ్యానముచేయుటచేత అంతఃకరణములో ఒక విలక్షణమైన సాత్త్వికానందము అనుభవమునకువచ్చును. ఆ రుచి మరిగిన మనస్సు ఇక దానిని విడిచి పెట్టలేదు. ఆస్థితికి వచ్చువరకే మనస్సును బాహ్యవిషయములమీదికి పోనీయకుండ ఆపవలసిన కష్టము. ఆ కష్టము ఇక ఉండదు. ఆ హేతువున మనస్సు పరమాత్మ ధ్యానములో బాగుగా స్థిరత చెందును. తరువాత అతడు శాశ్వతానందమునకు అర్హుడగుచున్నాడు.

అవతారిక :—

బాహ్యవిషయములయందు ఆసక్తి లేకుండుటచే పరమార్థప్రాప్తిని చెప్పి, ఇప్పుడు ఈ శ్లోకములో బాహ్య

విషయములయందు ఆసక్తి దుఃఖములకు కారణము అని నిరూపించి, ఆసక్తిని తప్పక విడువవలసినదిగా హెచ్చరించుచున్నాడు పరమాత్మ.

శ్లో॥ యే హి సంస్పర్శజా భోగా
దుఃఖయోనయ ఏవ తే ।
అద్యంతవంతః కౌంతేయ !
న తేషు రమతే బుధః ॥ ౨౨

ప. వి :-యే, హి, సంస్పర్శజాః, భోగాః, దుఃఖయోనయః, ఏవ, తే, అద్యంతవంతః, కౌంతేయ, న, తేషు. రమతే, బుధః.

టీక :-

కౌంతేయ! = ఓ అర్జునా!
సంస్పర్శజాః = ఇంద్రియములకు విషయములకు సంయోగము కలుగుటవలన పుట్టిన,
భోగాః = సుఖములు,
యే (సంతి) = ఏవి కలవో,
తే = అవి,
దుఃఖయోనయ ఏవ = దుఃఖములకే హేతువులగుచున్నవి;
హి = ఏలయనగా,

ఆద్యంతవంతః = ఆదియును అంతమును కలవి-అనగా అనిత్యములు,

(తతః = అందువలన)

తేషు = ఆ సుఖములయందు,

బుధః = వివేకము కలవాడు,

న రమతే = ప్రీతిచేయడు (అనగా కాంక్షపొందడు).

తా. అర్జునా ! ఇంద్రియములు విషయములయందు ప్రవర్తించుట వలన కలుగు సుఖములు, నిలకడగ ఉండునవి కాకపోవుటచే - అనగా ఆద్యంతములు కలిగి, నశించెడివగుటచే- దుఃఖములకే కారణములగు చున్నవి. కనుకనే యథార్థము నెరిగిన బుధులు వాటిని కాంక్షచేయరు.

అమృతవాహిని :—

బాహ్యవిషయములకును, ఇంద్రియములకును సంయోగము కలిగినప్పుడు భ్రమచేత సుఖభ్రాంతి కలుగుచున్నది. అందుచేత వాటిని భోగములుగా తలచి అజ్ఞానులు కోరుచున్నారు. యథార్థ మాలోచించిన అవి దుఃఖములకే కారణములగుచున్నవి.

మిడుతలు జ్వాలనుచూచి, అజ్ఞానముచేత, మహాసుఖము కలుగునని భ్రమించి, గాబోవు మహాభయంకరమైన పరిణామమును తెలిసికొనలేక గుంపులు గుంపులుగా ఎగిరి ఎగిరివచ్చి దానిలోబడి దగ్ధమైపోవుచున్నవి. అదేవిధమున అజ్ఞానులైన

మానవులును ప్రాపంచిక విషయోపభోగములే సుఖహేతువులుగా భావించి, అపరిమితమైన ఆసక్తితో, వాటిని అనుభవించుటకై విశ్రాంతి అనునది ఎరుగక రాత్రిందివములు ప్రయత్నములు సలుపుచున్నారు. చివరకు మహాదుఃఖములనే పొందవలసినవారగుచున్నారు. ఇది తెలియలేకుండ నున్నారు మానవులు.

ఈ విషయములే సుఖహేతువులని తలంచి అనుభవించుటచేత మరల మరల అనుభవించవలయుననెడి ఆసక్తి వృద్ధిచెందును. ఆసక్తిచేతనే కామము, దానికి విఘ్నము కలుగుననుకొనినప్పుడు క్రోధము - ఇట్లే అనర్థదాయకములైన దుర్గుణములన్నియు ఒక్కుమ్మడిగ కలుగును. ఆ గుణములున్నచోట అనేకవిధములైన, నీచాతినీచములగు దుర్లక్షణములును, దురాచారములును వచ్చి ఒక్కుమ్మడిగా ఆ వ్యక్తిని చుట్టుముట్టును. ఇక ఆతని జీవితమే పాపమయమై పోవును. దానికి ఫలముగా ఇహపరలోకములు రెండును చెడిపోయి, ఇక్కడను అక్కడనుకూడ అపరిమితములైన భయంకర బాధలు యాతనలు అనుభవించవలసివచ్చును. ఇంతేగాక, ఆభోగము లనుభవించుటకు ఏ యే పదార్థములు వ్యక్తులు సాధనములుగ తలంచుచున్నారో, ఆ సమస్తమును క్షణభంగురమగుటచేత మాటిమాటికి నష్టమైనశించిపోవుచుండును. అప్పుడు దుఃఖమును పొందుటయేకాదు - వాటియొక్క

సంబంధముచేత కలిగిన సంస్కారములు మాటిమాటికిని జ్ఞాపకమునకు తెచ్చుచుండుటచేత మానవుడు సదా దుఃఖసముద్రములో మునిగి అపరిమితముగా బాధపడుచున్నాడు. నెత్తి బ్రద్దలు కొట్టుకొనుచు ఏడ్చుట, అరచుట చేయుచుండును.

ఇంకను - అజ్ఞాని మిగిలినవారికంటె తాను అన్నిటిలోను ఎక్కువగ నుండవలయునని తలంచుచుండును గాన, ధనములోగాని, వస్తుసామగ్రిలోగాని, పేరుప్రతిష్ఠలలోగాని, ఇంక ఏవిషయములోనైనను తనకంటె ఇతరులు ఎక్కువగ నుందురేమో అను అనుమానము కలుగునప్పటికే భయము, అసూయ అగ్నివలె వారి హృదయమును కాల్చివేయుచుండును.

జాగ్రత్తగ ఆలోచించినయెడల విషయసంయోగముచే కలిగెడి భోగములు వాస్తవమునకు సర్వథా దుఃఖములకే కారణములగుచున్నవని తెలియగలదు. వాటియందు సుఖమన్నది ఏమాత్రమును లేదు. అజ్ఞానముచేత సుఖముగా తోచుచున్నది. కనుకనే కృష్ణభగవానుడు ఈ ప్రాపంచిక విషయోపభోగములన్నియును దుఃఖహేతువులే అని నిర్ణయించినాడు.

ఇవి 'ఆద్యంతవంతః' - ఆది, అంతము కలవి. అనగా జలబుద్బుదములవలె, మెరపులవలె క్షణభంగురములు, అనిత్యములు. వీటియందు సుఖము లేశముకూడ లేకపోయినను, అజ్ఞానముచేత సుఖదాయకములుగా కొంతమంది తలంచినను,

ఆ సుఖముకూడ నిత్యముకాదు. క్షణికమే. సృష్టిలోని ప్రతి వస్తువును అనిత్యమే అయినప్పుడు, అనిత్యమైన వస్తువుతో నిత్యసుఖము దొరకునా ? రెండవ అధ్యాయములో పదు నాలుగవశ్లోకములో కూడ "ఆగమాపాయినః" 'విషయోప భోగములు రాకపోకలు కలిగినవి' అని చెప్పబడియున్నది. కనుక తత్త్వము తెలియని వివేకహీనులు మాత్రమే ఈ విషయోప భోగములందు ప్రీతిచేయుదురు. కాని వివేకముగల సాధువులు వీటియందు కాంక్ష చేయరు.

శ్లో॥ శక్నోతీహైవ యస్సోఢుం
ప్రాక్శరీర విమోక్షణాత్ ।
కామక్రోధోద్భవం వేగం
స యుక్తస్స సుఖీ నరః ॥ ౨౩

ప. వి : శక్నోతి, ఇహ, ఏవ, యః, సోఢుం, ప్రాక్, శరీర విమోక్షణాత్, కామక్రోధోద్భవం, వేగం, సః, యుక్తః, సః, సుఖీ, నరః.

టీక :—

యః నరః = ఏ మానవుడు,
కామ క్రోధోద్భవం వేగం = కామక్రోధములచే కలుగు వేగమును,
ఇహైవ = ఇక్కడనే,

శరీర విమోక్షణాత్ ప్రాక్ = శరీరపతనమునకుముందే,

సోఢుం = అరికట్టుటకు,

శక్నోతి = సమర్థుడగుచున్నాడో,

సః = వాడు,

యుక్తః = యోగి;

సః = వాడు,

సుఖీ = సుఖవంతుడు.

తా. ఏ నరుడు కామము యొక్క వేగమును, క్రోధముయొక్క వేగమును - అనగా కామక్రోధములచే అంతఃకరణములో కలిగిన క్షోభమును - ఇక్కడనే - తనశరీరము పడిపోవులోపలనే - అరికట్టుటకు సమర్థుడగునో, వాడే యోగి; వాడే సుఖవంతుడు.

అమృతవాహిని :—

సాధకుడు ఎప్పుడు కామక్రోధములవలన అంతఃకరణమునందు కలిగిన క్షోభమును - నిలుపగలుగునో - అనగా జయించగలుగునో - వాడే యోగి. అటువంటివానినే ధీరుడనికూడ వ్యవహరింతురు. వీరుడైనవాడు సముద్రమువలె శత్రుసైన్యము తనను చుట్టుముట్టినను ఏమియును చలించక ధైర్యముగా ఏకాకియై ఆ సైన్యమును ఒక్క అడుగుకూడ ముందునకు వేయనీయక ఆపగలుగవచ్చును. కాని వాడు తన అంతఃకరణములోని ఈ క్షోభమును కళ్ళెముపట్టి ఆపలేడు అట్లు ఆపగలిగినవాడే ధీరుడు వాడే యోగి. వాడే

యథార్థముగ సుఖవంతుడు. అంతవరకును ఎంతటివారికైనను సుఖము మాత్రము శూన్యము.

ఈ శరీరముతో ఉండగనే, ఈ శరీరము పడిపోవు లోపలనే కామక్రోధములమీద విజయము సంపాదించవలయును. మానవశరీరముకంటె ఇతరమైన దేవతాదేహములందుగాని, పశు పక్షి మృగాది దేహములందుగాని, సాధన చేసి కామక్రోధములను జయించుటకు అవకాశము లేదు. దేవతా జన్మలలో విలాసములకు భోగములకు ప్రాధాన్యము ఉండుట చేతను, పశు పక్షి మృగాది జన్మలలో జడత్వము ఎక్కువగ ఉండుటచేతను, సాధనకు వీలులేనట్టివి. "ఇహైవ" 'ఇక్కడనే' అనుటలో ఈ మానవశరీరములోనే అట్టి అవకాశము కలదు. అట్టి అవకాశమును జారవిడుచుకొనవద్దు అని పరమాత్మ మానవులను హెచ్చరించుచున్నాడు.

ఈ మానవదేహమును గూర్చి "మోక్షద్వారం సుదుర్లభం" అని చెప్పబడియున్నది. జీవునకు పరమాత్మచేత ఈ మానవదేహము ప్రసాదించబడినదే మోక్షమును సంపాదించుటకు. అట్టి మహోత్కృష్ట ఫలమునకు సాధనమైన ఈ దేహమును పాడు విషయసుఖములకై - శునక, సూకరాది దేహములలోకూడ అతిసులభముగా లభ్యమగు నీచమైన విషయసుఖములకే ఉపయోగించుకొని, అమోఘమైన సదవ

కాశమును చేతులార పాడుచేసికొనిన వారికంటె తెలివితక్కువ వారు ఎవరుందురు? కేనోపనిషత్తులలోకూడ "ఇహ చే దవేదీ దథ సత్య మస్తి నచే ది హావేదీన్ మహతీ వినష్టిః" (2-5) 'ఈ మానవదేహములోనే భగవంతుని తెలిసికొనిన మంచిది. ఈ శరీరము ఉండగనే తెలిసికొననియెడల చాల గొప్ప హాని గలదు' అని చెప్పబడియున్నది.

అట్లే చేసికొనవచ్చును. కాని అప్పుడే తొందర ఏమి అనుకొని ఒక్కక్షణము కూడ ఆలస్యము చేయరాదు. ఈ శరీరము నశించితీరునది అనుట నిశ్చయమేగదా! కాబట్టి శరీరము విడిచిపోవులోపలనే విజయమును పొందితీరవలయును. పోనీ ఈ శరీరము నశించునది అగుటేకాదు. ఎప్పుడు నశించునది నిర్ణయములేదు. ఏక్షణమున పడిపోవునో తెలియదు. ఆ కారణమున ఎప్పటికప్పుడే ఒక్కక్షణముకూడ వృధచేయక, పట్టుదలతో భగవంతునిపై భారమునైచి సాధన చేయవలయును.

కామక్రోధములవలన కలిగిన వేగము అనగా :

స్త్రీ పురుషులకు, ఒకరియందు ఒకరికి సుఖాభిలాషతో కలిగెడి ఇచ్ఛను 'కామము' అందురు. అంతేకాదు, పతిసతి పుత్త్రాది దేహబంధువులు, ధనము, ఇల్లు, వాకిలి, స్వర్గాది ఊర్ధ్వలోకములలోని భోగములు మొదలగు విషయముల

యందు ఆసక్తి ఉండుటచే వానిని పొందుటకు, అనుభవించుటకు, కలిగెడి ఇచ్ఛను కూడ కామమనియే అందురు. ఈ ఇచ్ఛచే అంతఃకరణములో ఉద్భవించెడి నానావిధములైన సంకల్ప వికల్పములయొక్క మహాప్రవాహమే కామమువలన కలిగిన వేగమనగా.

కామమునకు విఘ్నములు బాధలు సంభవించినప్పుడుగాని, మనోబుద్ధీంద్రియములకు ప్రతికూల విషయములు సంప్రాప్తించినప్పుడుగాని, దానికి కారణమైన పదార్థమునందో వ్యక్తియందో ద్వేషభావము కలిగి, అందువలన అంతఃకరణమునందు ఉద్భవించెడి ఉద్రేకమును క్రోధ మందురు. ఈ క్రోధముచే అంతఃకరణమున కలిగెడి నానావిధములైన సంకల్ప వికల్పములయొక్క మహాప్రవాహమే క్రోధముచేత కలిగెడి వేగమనగా -

ఈ వేగములు కార్యరూపములోనికి పరిణతి చెందనీయకుండ అరికట్టి, వాటిని కారణసహితముగ నశింపజేయుటకు తగినశక్తిని పొంది, వాటిని నశింపచేయుటయే విజయమును సంపాదించుట అనగా. దీనిని సాధించగలిగినవాడే యోగి అనబడును. అతడే నిజమైన సుఖి.

సృష్టిలో మానవులందరును సుఖము కావలయుననియే అభిలషింతురు. దానికై ప్రయత్నింతురు. కాని నిజమైన సుఖ

మేదియో దాని నెట్లు సాధించవలయునో తెలియకపోవుటచేత, ప్రాపంచిక విషయోపభోగములయందే సుఖమున్నదను భ్రమతో, ఆ విషయోపభోగములనే కోరుచు వాటికొరకే విశ్రాంతిలేక రాత్రిందివములు ప్రయత్నములు సలుపుచుందురు. తమ ప్రయత్నములకు అడ్డువచ్చినను, తమకు సాహాయ్యము చేయకపోయినను, క్రోధమునకు పాల్పడుదురు. కాని కామ క్రోధములకు వశపడియున్నవారికి ఎన్నటికిని సుఖము దొరకదు.

కామమునకు వశపడినవాడు తన లాభమునకై, తల్లి, తండ్రి, భార్య, పతి, పుత్త్రులు, ధనము, పేరుప్రతిష్ఠలు మొదలగు వాటికొరకును, క్రోధమునకు వశపడినవాడు ఇతరులకు అనిష్టము చేయుటకును, అనేకరకములైన అనర్థములు పాపములు చేయుచుండును. దీనిచే సుఖములేకపోగా, ఈలోకములో, రోగములు, శోకములు, అవమానములు, అపకీర్తి, అశాంతి, నానావిధములైన బాధలు మొదలగునవి అనుభవించవలయును. పరలోకములో అనేకవిధములైన భయంకర నరకయాతనలను అనుభవించవలయును. తరువాత పశు పక్షి క్రిమి కీటకాది నీచమైన క్షుద్రమైన జన్మలనెత్తి పలువిధములైన క్లేశములను అనుభవించవలయును. ఈ విధముగా సుఖమును పొందకపోగా, సదా మహాదుఃఖములనే పొందుచుండును.

ఈ భోగములన్నియును దుఃఖహేతువులు, క్షణభంగురములు అని తెలిసికొని, కామ క్రోధాది శత్రువర్గముపై

పూర్తి విజయమును పొందినవారు- వారుమాత్రమే- సదా సుఖవంతులుగా ఉందురు. ఈ విషయమే పరమాత్మ ఈ శ్లోకములో ప్రతిపాదించినాడు.

'స సుఖీ నరః' అని ఇక్కడ నరశబ్దము ప్రయోగించబడినది. దీనిచే తెలియవలసిన విశేషమున్నది. కామక్రోధాది దుర్గుణము లన్నిటిని పూర్తిగ జయించి,బ్రహ్మలోక పర్యంతములైన సమస్త భోగములందును పరమవైరాగ్యము కలిగి, సచ్చిదానందఘనపరబ్రహ్మమును పొందినవాడే నిజమైన నరుడు. స్త్రీ పురుష వివక్షతో సంబంధములేదు. అజ్ఞానముచేత మోహితుడై విషయోపభోగములయందలి వ్యసనములో చిక్కుకొని, భగవంతుని మరచిపోయినవాడు, కామక్రోధాది పరాయణుడై పశు పక్షి శునక సూకరాది జంతువులవలె ఆహారము, నిద్ర, మైథునము, కలహము మొదలగువాటి యందే మగ్నుడై ప్రవర్తించువాడు నరుడుకాడు. నరరూపమున ఉన్న పశువు అని పరమాత్మ భావము.

అవతారిక:-

శరీరము ఉండగనే కామక్రోధోద్భవమైన వేగమును అరికట్టినవాడు, నిజమైన సుఖి అని ప్రతిపాదించిన పరమాత్మ, ఆ సుఖస్వరూపమును వివరించుచు, అట్టివాని స్థితినిగూర్చి చెప్పుచున్నాడు ఈ తరువాతి శ్లోకములో.

శ్లో॥ యోఽన్తస్సుఖోఽన్తరారామః
తథాన్తర్జ్యోతిరేవ యః
స యోగీ బ్రహ్మనిర్వాణం
బ్రహ్మభూతోఽధిగచ్ఛతి ॥ ౨౪

ప. వి :— యః, అంతస్సుఖః, అంతరారామః, తథా, అంతర్జ్యోతిః, ఏవ, సః, యోగీ, బ్రహ్మనిర్వాణం, బ్రహ్మభూతః, అధిగచ్ఛతి.

టీక :—

యః = ఎవడు,
ఏవ = నిశ్చయముగా,
అంతస్సుఖః = అంతరాత్మగానున్న పరమాత్మయందే సుఖమనుభవించువాడుగాను,
అంతరారామః = అంతరాత్మయైన పరమాత్మయందే ఆనందించువాడుగాను ఉండునో,
యః = ఎవడు,
అంతర్జ్యోతిః = అంతరాత్మయైన పరమాత్మనుగూర్చిన జ్ఞానమే-స్ఫురణయే - గలిగిఉండునో,
సః = అట్టివాడు,
యోగీ = యథార్థమైన భగవదనుభవము కలవాడు-
బ్రహ్మభూతః = బ్రహ్మస్వరూపుడే - అతడు

బ్రహ్మనిర్వాణం = పరిపూర్ణ భగవదనుభవానంద మును - పరమపదమును,

అధిగచ్ఛతి = పొందుచున్నాడు-

తా. బాహ్యవిషయములకు సంబంధించిన సుఖములకై పరుగులు పెట్టక, తనకు అంతరాత్మగా ఉన్న పరమాత్మయందే సుఖమనుభవించు వాడును, అంతరాత్మయైన పరమాత్మయందే ఆనందించువాడును, అంత రాత్మగా వెలుగొందుచున్న ఆ పరమాత్మకు సంబంధించిన జ్ఞానమే - స్పృహయే - కలిగియుండువాడును అగు మహాత్ముడు, యథార్థమైన భగవదనుభవముకల యోగి. అతడు బ్రహ్మస్వరూపుడే. అతడు పరి పూర్ణ భగవదనుభవానందరూపమగు పరమపదమును పొందుచున్నాడు.

అమృతవాహిని :-

యథార్థమైన భగవదనుభవముకల యోగి స్థితినిగూర్చి చెప్పుచున్నాడు పరమాత్మ ఈ శ్లోకములో-"యోఽంతస్సుఖః" అని ప్రారంభించి. అంతరాత్మయైన పరమాత్మయందే సుఖము అనుభవించువాడు అని అర్థము. సుఖము కావలెనని కోరుట జీవ లక్షణము. సర్వజంతువులును అట్లు కోరుచునే ఉన్నవి. కాని, నిజముగ సుఖమును పొందుచున్నవా ? లేదు. ఎందుచేత ? యథార్థమైన సుఖమునకు అవకాశము లేనిచోట సుఖమును గురించి వెదకుచు తమ శక్తియుక్తులను వ్యర్థము చేయు చున్నవి. జంతువులలో శ్రేష్ఠుడు అనబడుచున్న మానవుడు కూడ - కోటికి ఏ ఒకడో తప్ప - అంతకుమించిన వివేకము లేక

వ్యవహరించుచు, యథార్థమైన సుఖమునుండి తననుతానే వంచించుకొనుచున్నాడు.

సుఖము శబ్దస్పర్శరూపరసగంధములు అను బాహ్య విషయములలో ఉన్నదనుకొని యత్నించుటయే ఈ ఆత్మ వంచన. యథార్థమైన సుఖము ఈ బాహ్యవిషయములలో లేదు. ఈ బాహ్యవిషయములవలన కలుగుచున్నది సుఖ భ్రాంతియేగాని యథార్థమైన సుఖముకాదు.

యథార్థమైన సుఖము దేశ కాల పాత్ర అవస్థాదులచేత భంగింపబడదు. మరి విషయానుభవమువల్ల కలిగిన ఈసుఖము అట్లున్నదా ? ఒకే విషయమువలన ఒక ప్రదేశమున సుఖము పొందినవాడే, అదే విషయమువలన మరొక ప్రదేశమున దుఃఖము పొందుచున్నాడు. ఒక విషయమువలన ఒక కాలమున సుఖమును పొందినవాడు, మరొక కాలమున అదే విషయము వలన దుఃఖము పొందుచున్నాడు. ఒకనికి సుఖదాయకమైన విషయమే మరొకనికి దుఃఖదాయకము అగుచున్నది. ఒక అవస్థలో సుఖము కలిగించిన విషయమే మరొక అవస్థలో దుఃఖము కలిగించుచున్నది. అందుచేతనే బాహ్యవిషయముల వలన- అనగా శబ్ద స్పర్శ రూప రస గంధముల వలన- కలుగునది సుఖభ్రాంతికాని యథార్థమైన సుఖముకాదు.

సుఖముకొరకై బాహ్యవిషయములపై ఆధారపడక, యథార్థమైన సుఖము - దేశ కాల పాత్ర అవస్థాదులచే

భంగింపబడని సుఖము - భగవదనుగ్రహమువలన, భగవదను భవమువలన కలుగునని గ్రహించి, ఆశ్రయించి, తనకు అంతర్యామిగా ఉన్న ఆ పరమాత్మయందే సుఖము అనుభవించువాడు 'అంతస్సుఖుడు'.

అనాదిగా జననమరణరూప సంసారచక్రమున పరిభ్రమించుచు, అవిరతముగ విశ్రాంతిచెందుచున్న - శ్రమించు చున్న-జీవికి, ఏనాటికైన ఈ సంసారచక్రపరిభ్రమణము ముగిసిననాడే విశ్రాంతి. రంగులరాట్నమున కూర్చుండి, ఆ రంగులరాట్నముయొక్క వేగమువలన కనులుతిరుగుచున్న బాలునికి ఆ కనులుతిరుగుట ఎట్లు తప్పును ? రంగులరాట్నము తిరుగుట మానినప్పుడుకదా! తిరుగుట ఆగినది - విశ్రాంతి లభించినది. అనగా దుఃఖము పోయినది. అది చాలదు. దుఃఖనివృత్తి ఒకటేకాదు కావలసినది - ఆనందప్రాప్తికూడ కావలయును. బాలునికి కనులుతిరుగుటకు కారణమైన రంగుల రాట్నముయొక్క చలనము ఆగినది. ఆ కనులుతిరుగుట పోయినది. కాని, అదేకాదు. బాలునికి కావలసినది. ఆ రంగుల రాట్నమునుండి విడివడి తన తల్లి ఒడిలోనికి చేరవలయును. అప్పుడుగాని యథార్థమైన ఆనందమును పొందలేడు. రంగుల రాట్నము ఆగుట దుఃఖనివృత్తి; తల్లి ఒడిలోచేరుట ఆనంద ప్రాప్తి. అట్లే జననమరణరూపసంసారచక్ర పరిభ్రమణము

అగుటొక్కటే కాదు కావలసినది - భగవత్ప్రాప్తిరూపమైన యథార్థమైన ఆనందము లభించవలయును. అంతరాత్మగా ఉన్న పరమాత్మనుగుర్తించి, ఆశ్రయించి, అట్టి ఆనందమును అనుభవించువాడు 'అంతరారాముడు'.

అంతరాత్మగా ఉన్న ఆ పరమాత్మనుగూర్చిన జ్ఞానము-స్పృహ- తప్ప, ఇతర స్పృహలేనివాడు 'అంతర్జ్యోతి'.

అట్టివానికి ఇతరస్పృహ ఉండదు. శరీరము ఉన్నంత వరకు పరమాత్మసంకల్పము ప్రకారము ఆ శరీరముద్వారా జరుగవలసిన అన్నిపనులు జరిగిపోవుచునే ఉండును-అయితే, అతనికి ఆయాపనులు చేయవలయును అను సంకల్పముకాని, అవి తనద్వారా జరుగుచున్నవి అను స్పృహకాని ఉండదు. సర్వకాలసర్వావస్థలయందును అంతరాత్మగా ఉన్న ఆ పరమాత్మకు సంబంధించిన జ్ఞానములోనే- స్పృహలోనే- మునిగి ఉండును.

> "పానీయంబులు ద్రావుచున్ కుడుచుచున్ భాషించుచున్ హాస లీ
> లా నిద్రాదులు సేయుచున్ నడచుచున్ లక్షించుచున్ సంతత
> శ్రీ నారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సంధానత"

కల ప్రహ్లాదునిస్థితి అట్టిది. అదే యథార్థమైన యోగము. అట్టివాడే యథార్థమైనయోగి.

యథార్థమైనయోగి బ్రహ్మభూతుడే, బ్రహ్మస్వరూపుడే. కొలిమిలో బాగుగకాలి ఎఱ్ఱవారిన ఇనుపగుండు,

వస్తుతః ఇనుపగుండే అయినను, అగ్నిగోళమే అగుచున్నది కదా! దానిని సమీపించిన, స్పృశించిన అగ్నియే అనుభవము లోనికి వచ్చుచున్నది కాని, అయస్తత్త్వము కాదుకదా! అట్లే బ్రహ్మభూతుడైన అట్టి మహాత్ముని సాహచర్య సాన్నిధ్య ములు భగవత్సాహచర్య సాన్నిధ్యములుగనే ఫలించును. అందుచేతనే అట్టివానిని బ్రహ్మభూతుడు అనినాడు పరమాత్మ. బ్రహ్మభూతుడైన అట్టి యోగి బ్రహ్మనిర్వాణమును- పరిపూర్ణ భగవదనుభవానందమును- బ్రహ్మానందమును - పొందును.

ఈ శ్లోకమునందలి "అంతస్సుఖః" "అంతరారామః" "అంతర్జ్యోతిః" అను వానిలోని 'అంతః' అను పదమునకు తనకు అంతరాత్మగా ఉన్న పరమాత్మయందే - అన్న అర్థమేకాక, సర్వసృష్టిలోను వ్యాపించి, సర్వాంతర్యామిగా ఉన్న - అని కూడా చెప్పుకొనవచ్చును. నిజమునకు ఈ రెండు అర్థములు పరస్పరవిరుద్ధములు కాకపోవుటేకాదు, పరస్పరపోషకములు కూడ.

శ్లో॥ లభన్తే బ్రహ్మనిర్వాణ
మృషయః క్షీణకల్మషాః ।
ఛిన్నద్వైధా యతాత్మాన
స్సర్వభూతహితే రతాః ॥ ౨౫

ప. వి :—లభన్తే, బ్రహ్మనిర్వాణం, ఋషయః, క్షీణకల్మషాః, ఛిన్నద్వైధాః, యతాత్మానః, సర్వభూతహితేరతాః.

టీక :—

క్షీణకల్మషాః = సర్వపాపములు నశించినట్టియును,
ఛిన్నద్వైధాః = ఛిన్నాభిన్నము చేయబడిన శీతోష్ణాది ద్వంద్వములును, సందేహములును కలిగినట్టియును,
యతాత్మానః = నియమించబడిన మనస్సు కలిగినట్టియును,
సర్వభూతహితేరతాః = సర్వభూతముల విషయమునను హితమునే కోరుచు ప్రవర్తించునట్టియును,
ఋషయః = ద్రష్టలైన మహాత్ములు,
బ్రహ్మనిర్వాణం = పరబ్రహ్మప్రాప్తిని,
లభన్తే = పొందుచున్నారు.

తా. శీతోష్ణాది ద్వంద్వములను, సకలసందేహములను, సమూలముగ జయించి మనస్సును పరమాత్మధ్యానమందే నియమించి, సర్వభూతములకును హితమునే కోరి ప్రవర్తించుచు, ఇట్టి యోగాచరణము వలన భగవదనుభవమునకు విరోధరూపములగు సర్వకల్మషములు నశించినవారై మహాత్ములు - ద్రష్టలు - పరిపూర్ణ భగవదనుభవమును పొందుచున్నారు.

అమృతవాహిని :—

'క్షీణకల్మషాః' అనగా పుణ్యపాపరూపమైన సర్వకల్మషములు నశించినవారు అని అర్థము. కల్మషము అనగా పాప

మొక టేకాదు, పరిపూర్ణ భగవదనుభవమునకు - మోక్షము నకు ఆటంకము కలిగించు పుణ్యమును కల్మషమే. అందుచే పాపము చేయకుండు టేకాక, కామ్యకర్మలుకూడ కాక, కేవలము భగవత్సేవారూపకర్మ చేయు నిష్కామకర్మ యోగులు క్షీణకల్మషులు.

'ఛిన్నద్వైధాః' అనగా ద్వంద్వములను జయించినవారు అని అర్థము. ద్వంద్వములు అనగా శీతోష్ణాదులు, సుఖదుఃఖా దులు. 'శీతోష్ణ సుఖదుఃఖేషు సమః' అన్నట్లు, అన్నిటిని సమముగా చూడగలిగినవారు ద్వంద్వములను జయించినవారు అనవచ్చును. శీతోష్ణములను సమముగ చూడవచ్చును. కష్ట సుఖములనుగూడ సమముగా స్వీకరింపవచ్చును. కాని, మానావమానములను సమముగా చూచుట, స్వీకరించుట, కష్టతరము. కీర్తికాంక్ష, గౌరవముపై అభిమానము - చిట్ట చివరివరకు అంటిపెట్టుకొని ఉండునవి. మానావమానములు గూడ సమముగ చూడగలిగిననాడుగాని ద్వంద్వాతీతుడు కాడు. అట్టి ద్వంద్వాతీతస్థితిని అధిగమించినవారు - అనగా పొందినవారు - 'ఛిన్నద్వైధాః' -

'యతాత్మానః' అనగా నియమించబడిన మనస్సు కల వారు అని అర్థము. శీతోష్ణములు, సుఖదుఃఖములు మొదలగు ద్వంద్వములను సమముగ చూడవలయును కనుక, సమముగ

చూచు ప్రయత్నము చేయుట, చూచుట - అనికాక, మనస్సునందు ఆస్పృహాయే రానిస్థితి సాధించవలయును. ఒకదానియందు ఇష్టము, మరొకదానియందు అనిష్టము, ఇట్టి ఇష్టానిష్టములు, రాగద్వేషములు, మూలముట్టుగ నశించి, ఎల్లవేళల భగవద్ధ్యానమున నిలిచిన, సర్వమునందును పరమాత్మనే దర్శింపగలిగిన మనస్సుకలవారు 'యతాత్మానః'.

అట్టివారి చర్యలన్నియు కేవలము సర్వభూతములకు హితమును కూర్చునవిగ ఉండుటలో ఆశ్చర్యములేదు. వారికి స్వసంకల్పమే ఉండదు. వారు కర్తలుకారు. వారి దేహేంద్రియాదులు నిమిత్తములుగ చేసికొని, పరమాత్మయే వ్యవహరించుచుండును. బాహ్యదృష్టికి వారుచేయుచున్నట్లు కనబడినను, చేయునది వారుకాదు - పరమాత్మయే. కాని, వ్యావహారికముగ చెప్పవలసివచ్చినప్పుడు వారు చేసినట్లే చెప్పబడును. కనుక 'సర్వభూతహితేరతాః' అని చెప్పబడినది.

అట్టివారు ఋషులు-ద్రష్టలు-పై లక్షణములుకల ద్రష్టలైన ఋషులు పరిపూర్ణ పరబ్రహ్మానుభవమును - బ్రహ్మనిర్వాణమును - పొందుచున్నారు అని వివరించుచున్నాడు శ్రీకృష్ణ పరమాత్మ.

శ్లో॥ కామక్రోధ వియుక్తానాం
యతీనాం యతచేతసామ్ ।
అభితో బ్రహ్మనిర్వాణం
వర్తతే విదితాత్మనామ్ ॥ ౨౬

ప. వి :—కామక్రోధవియుక్తానాం, యతీనాం, యతచేతసామ్, అభితః, బ్రహ్మనిర్వాణం, వర్తతే, విదితాత్మనామ్.

టీక :—

కామక్రోధవియుక్తానాం = కామక్రోధములను పూర్తిగ విడిచినట్టియు,
యతచేతసాం = మనస్సును జయించినట్టియు,
విదితాత్మనాం = ఆత్మజ్ఞానము పరిపూర్ణముగా కలిగినట్టియు,
యతీనాం = యతీశ్వరులకు,
బ్రహ్మనిర్వాణం = పరిపూర్ణ భగవదనుభవరూపమైన ముక్తి,
అభితః = సర్వత్ర,
వర్తతే = కలుగుచున్నది.

తా. కామక్రోధములను పరిపూర్ణముగ విడిచినట్టియు, మనో జయము సాధించినట్టియు, ఆత్మజ్ఞానము లభించినట్టియును యతీశ్వరులకు పరిపూర్ణ భగవదనుభవరూపముక్తి సర్వత్ర - దేశకాల పాత్రాది భేదములేకయే - కలుగుచున్నది.

అమృతవాహిని :-

కామక్రోధాదులను పూర్తిగా విడుచుట యతులకు ప్రథమము, ప్రధానము అగు లక్షణము. సర్వదుర్గుణములకును మూలకారణము కామమే. కామమే క్రోధముగా పరిణమించుచున్నది. ఈ కామక్రోధవికారములే తక్కిన దుర్గుణములన్నియును. "కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః, మహాశనో మహాపాప్మా విద్ధ్యేన మిహ వైరిణమ్" 'పాపము చేయుటకు కారణమైనది కామము. ఈ కామమే క్రోధముగా పరిణమించుచున్నది. ఇది రజోగుణముచేత పుట్టినది. ఎంత తినినను కడుపునిండుట లేనిది; మోక్షసంపాదనకు కృషిచేయువానికి ఇది గొప్ప శత్రువు అని తెలిసికొనుము' అనియును, "ధూమేనావ్రియతే వహ్నిః యథాదర్శో మలేనచ, యథోల్బేనావృతో గర్భః తథా తే నేద మావృతమ్" 'పొగచేత అగ్నియును, మలినముచేత అద్దమును, మావిచేత గర్భమును ఆవరింపబడినట్లు ఈ కామముచేత ప్రాణికోటి అంతయును ఆవరింపబడియున్నది' అనియును మూడవ అధ్యాయమున హెచ్చరించినాడు పరమాత్మ.

కామమువలన క్రోధము పుట్టుచున్నది అనుటకంటె, కామమే క్రోధముగా పరిణమించుచున్నది అనుట మేలు. అట్టి కామక్రోధములను మూలముట్టుగా విడువనినాడు యతి అగుటెట్లు ? అంతేకాదు - 'యతచేతసాం' నియమింపబడిన

మనస్సు కలవారు యతచేతసులు. విడువవలసినవి విడుచుటతో పాటు, అవలంబింపవలసినవి అవలంబించుటకూడ విధికదా! విడువనున్నవి విడుచుటకును అవలంబింపనున్నవి అవలంబించుటకును మనస్సు అధీనమునందుంచవలయును. అట్లు మనస్సును అధీనమునందుంచుకొనినవారు యతచేతసులు. కామక్రోధములను విడుచుటతోపాటు భగవద్ధ్యానమున నిలుచుటకూడ జరిగిననాడు వారు యతచేతసులు అనబడుదురు.

తరువాతి లక్షణము విదితాత్మత. భగవద్ధ్యానమునందు మనస్సు నిలువవలెనన్న భగవత్స్వరూపమునుగూర్చి - తత్త్వమునుగూర్చి - స్పష్టమైన అవగాహన అవసరము. భగవత్తత్త్వమునుగూర్చిన స్పష్టమైన అవగాహన లేనిచో, తక్కిన అన్ని సాధనలను సక్రమముగా చేసినను పూర్ణఫలము లభింపదు. స్పష్టమగు అట్టి అవగాహన కలుగుట భగవదనుగ్రహమువలన కాని సాధ్యముకాదు. ఆయనకు సంపూర్ణ శరణాగతి చేసినవారికిగాని అట్టి అనుగ్రహము లభింపదు. ఫలితార్థము - సంపూర్ణముగ శరణాగతిచేసి, భగవదనుగ్రహము లభించి, తత్ఫలముగ, భగవత్తత్త్వమునుగూర్చిన స్పష్టమైన అవగాహన పొందినవారే - విదితమైన ఆత్మస్వరూపము కలవారే - అనగా పరమాత్మస్వరూపము కలవారే - విదితాత్ములు.

ఇచ్చట 'విజితాత్మనాం' అన్న పాఠాంతరము గలదు. జయింపబడిన మనస్సుగలవారు అని చెప్పుకొనవచ్చును.

మనస్సును నియమించినవారు యతచేతసులు; జయించినవారు విజితాత్ములు. నియమించుటకంటె జయించుట పైదికదా ! కనుక పునరుక్తి లేదు. అంతేకాక, జయింపబడిన పరమాత్మ తత్త్వము కలవారు అని చెప్పినను అనౌచిత్యము లేదు. కేవలము అనుగ్రహస్వరూపుడగు పరమాత్మ భక్తులచేతిలో జయింపబడుటకే, వారు చెప్పినట్లు నడచుకొనుటకే సిద్ధముగ ఉండునుగదా ! "అహం భక్తపరాధీనః అస్వతంత్రఇవ ద్విజ" అన్న భాగవతసూక్తియును, "గీత్వాతు మమనామాని నర్తయే న్మమ సన్నిధౌ, ఇదం బ్రవీమి తే సత్యం క్రీతోఽహం తేన చార్జున!" 'నా నామసంకీర్తన చేయుచు నృత్యముచేయు వానికి నేను అమ్ముడుపోవుచున్నాను' అన్న ప్రతిజ్ఞయును ఇచ్చట స్మరింపదగినవి. అట్టివారికి బ్రహ్మనిర్వాణము - పరిపూర్ణ పరబ్రహ్మానుభవరూపదివ్యానుభూతి-ముక్తి- 'అభితః' అనగా సర్వత్ర - ఎచ్చటబడిన అచ్చటనే - దేశ కాల అవస్థాది నియమములు లేకుండ లభించును.

ఇచ్చట 'అభితః' అనుపదము చాలప్రధానమై పరిపూర్ణ భగవదనుభవరూపముక్తి కేవలము శరీరపతనానంతరమున లభించును అను భావమును త్రోసివేయుటకై పరమాత్మచేత ప్రయోగింపబడినది. ఇచ్చట ఈ పదమేగాక పందొమ్మిదవ శ్లోకమున "ఇహైవ తైర్జిత స్సర్గః" అనియును, రాబోవు ఇరువది ఎనిమిదవ శ్లోకమున 'యస్సదా ముక్త ఏవ సః' అనియును

కూడ వివరించుటద్వారా ఈ విషయమునే నొక్కిచెప్పు చున్నాడు పరమాత్మ.

అయితే విశిష్టాద్వైతదర్శనము జీవన్ముక్తస్థితిని ఒప్పలేదని భావము లోకమున కలదు. మతాంతరులేకాక విశిష్టాద్వైత పండితులును పెక్కురు ఇట్లే అనుచున్నారు. కాని భగవద్రామానుజ భాష్యములు ఆధారముగ విచారించినచో ఈవాదము నిలువదనియును, జీవన్ముక్తిపదము ఉపయోగింపకపోయినను, వీరు భావించునట్లు భగవద్రామానుజులు జీవన్ముక్తస్థితిని గూర్చి విరుద్ధాభిప్రాయము కలవారుకారనియును స్పష్టపడును.

'ఇహైవ తైర్జితస్సర్గః' అన్నచోట భగవద్రామానుజులు 'సాధనానుష్ఠానదశాయామేవ తైః సర్గోజితః సంసారోజితః' అని వ్యాఖ్యానించిరి. 'యస్సదాముక్త ఏవసః' అనుదానిని 'సాధ్య దశాయామివ సాధనదశాయామపి ముక్తఏవ సః' అని వ్యాఖ్యానించిరి. పై పంక్తులలోని 'సాధనానుష్ఠానదశ' 'సాధనదశ' అన్నపదములు ఆధారముగా సాధ్యదశయందలి అనుభవము సాధనయందు కలుగుట అసంగతము కనుక ఇచ్చట 'సంసారోజితః' అనగా 'జితప్రాయః' అనియును, 'సదా ముక్తఏవ' అనగా 'ముక్తప్రాయ ఏవ' అనియును చెప్పుచున్నారు చాల మంది పెద్దలు.

సాధ్యదశ అనగా పొందదగినస్థితి అని అర్థము. పొంద దగినస్థితి ఏది? శరీరపతనానంతరము అప్రాకృతము, పంచోపనిషన్

న్మయము అగు స్థానవిశేషము - పరమపదము - పొంది, నిత్యసూరులతో కలిసి సాయుజ్యముక్తినందుట - ఇది సాధ్యదశ. సాధనదశ అనగా సాధనకు ఆధారభూతమగు శరీరగతస్థితి. ఈ శరీరగతస్థితిలో భగవత్సేవారూపముగా చేయు దినచర్యానుష్ఠానము. సాధనదశ అనినను, సాధనానుష్ఠానదశ అనినను ఇట్లు అన్వయించుట యుక్తము. పరమపదమును పొందినప్పుడు సంసారము ఎట్లు జితము అని చెప్పబడునో, ఇచ్చట శరీరగతస్థితిలో, భగవత్సేవారూపయజ్ఞముగ జీవితము గడుపుచున్నను, అట్లే సంసారము జితము. అట్టివానికి బంధనములేదు అని అర్థము. బంధనము లేకుండుట ముక్తి అనుటలో తప్పేమి ? సాధ్యదశయందు ఎట్లు ముక్తుడో సాధనదశయందును అట్లే ముక్తుడు అని నిష్కర్షగా భగవద్రామానుజులు చెప్పుచున్నారు. అనగా పరమపదము పొందినవారు ఎట్లు ముక్తులో, ఇట్టిస్థితి పొందినవారు శరీరగతస్థితిలో ఉన్నను అట్లు ముక్తులే అనియే దానిభావము.

సాధనానుష్ఠానదశ అనగా శరీరగతస్థితి అనుటకుకూడ భగవద్రామానుజుల భాష్యమున ఆధారము కలదు. ఈ అయిదవ అధ్యాయమునందే “శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్శరీరవిమోక్షణాత్” అన్న శ్లోకమునకు భాష్యము వ్రాయుచు ‘శరీరవిమోక్షణాత్ ప్రాగిహైవ - సాధనానుష్ఠాన దశాయామేవ’ ‘శరీరవిమోక్షణమునకు ముందే -

అనగా సాధనానుష్ఠానదశయందే' - అని వివరించిరి. దానిని బట్టి పై అన్వయము సవ్యమైనదే అని స్పష్టపడుచున్నది.

అయితే ఈ 'శక్నో తీహైవ...' అన్న శ్లోకవ్యాఖ్యలో చివర 'స యుక్తః - ఆత్మానుభవాయ అర్హః; సఏవ శరీర విమోక్షణోత్తరకాల మాత్మానుభవైకసుఖః సంపత్స్యతే' అని వ్రాసిరి. దీనినిబట్టి ఆత్మానుభవమునకు - అనగా భగవదనుభవమునకు - అర్హత శరీరము ఉండగనే కలిగినను, భగవదనుభవరూపమోక్షము శరీరవిమోక్షణానంతరమే కలుగును అని తెలుచున్నది కదా అన్న పూర్వపక్షము రావచ్చును. కాని ఇచ్చట జాగ్రత్తతో పరిశీలించినచో అట్టి పూర్వపక్షమునకు అవకాశము ఉండదు. అర్హత కలిగినతరువాత ఫలప్రాప్తికి విలంబనము ఉండదు భగవద్రాజ్యములో. భగవదనుభవార్హత కలిగిన క్షణమునందే అనుభవము కలిగితీర వలయును. భగవదనుభవము పొందినవానిని బాధింపగల ప్రజ్ఞ ప్రకృతికే ఉన్నచో, ప్రకృతి భగవంతునికంటె శక్తి సంపన్నమైనదిగా చెప్పవలసివచ్చును. విడువవలసిన ప్రకృతి బాధ విడిచినతరువాత, కలుగవలసిన భగవదనుభవము కలిగినతరువాత, ఇంకను ఆతనిని బద్ధుడే అనుట అసంగతము. మరి అప్రాకృతము, పంచోపనిషన్మయము అయిన పరమపద లోకమునకు పోవుట మిగిలినది కదా అనిన, అందుచేతనే 'జీవత్' అను విశేషణము ముందుంచబడినది. ఆ భేదము

అనుభవమున లేదు. ఇప్పుడు శరీరగతుడై యుండియును ప్రకృతి బాధ లేనివాడు, భగవదనుభవానందము కలవాడు. అప్పుడు శరీరము లేదు. ఆ అప్రాకృత పరమపదమున ఈ ప్రకృతిబాధ లేక, భగవదనుభవానందము కలవాడు. భేదమొక్కటే - శరీరగతస్థితి, రహితస్థితి.

ఇక - 'శరీర విమోక్షణోత్తరకాల మాత్మానుభవైక సుఖః సంపత్స్యతే' అన్నచోట 'ఏక' అన్న పదము ప్రధానముగ గమనింపవలయును. పరమపదమునందు భగవదనుభవానంద మున - బ్రహ్మానందమున - ఓలలాడుటతప్ప, దాసస్ఫురణతో కింకరభావముతో ఆయన చేత అనుభవింపబడుటతప్ప వేరుగ అనుష్ఠానము లేదు. కర్మలేవు. అందుచే శరీర విమోక్షణోత్తర కాలమందు ఆత్మానుభవైకసుఖము - అనుభవము తక్క వేరొకటి లేనిసుఖము - పొందును. శరీర విమోక్షణా త్పూర్వము సేవారూపయజ్ఞముగ, స్వసంకల్పము లేకయే, పర మాత్మ చేతిలో పరికరమాత్రముగ ఉపయోగపడుచు ఉండును. "పానీయంబులు త్రావుచున్ గుడుచుచున్...... సంతత శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సంధానుండై" ఏతద్విశ్వమును మరచిన ప్రహ్లాదునిస్థితిలో ఉండును అన్నమాట. అందుచేతనే శరీరగతస్థితిలోని ఈ తక్కిన వేవియును లేకుండుటను సూచించుచు 'ఆత్మానుభవైక సుఖః సంపత్స్యతే' అనినారు భగవద్రామానుజులు.

ఇదికాక శ్రీభాష్యమున నాల్గవ అధ్యాయము రెండవ పాదమందలి ఏడవ సూత్రము - "సమానా చాసృత్యుపక్రమాదమృతత్వం చానుపోష్య" అన్నదానికి భాష్యము వ్రాయుచు, ఉత్క్రమణము పండిత పామరులకు సమానమే అని సిద్ధాంతము చేసినారు. ఆ సందర్భమున ముందుగ పూర్వపక్షవాదము ప్రతిపాదించుచు "ఇయ ముత్క్రాన్తిః కిం విద్వదవిదుషో స్సమానా ? ఉత అవిదుష ఏవేతి చింతాయాం అవిదుష ఏవేతి ప్రాప్తం; కుతః ? విదుషోఽత్రైవ అమృతత్వవచనాత్ ఉత్క్రాన్త్యభావాత్ విదుషోహ్యత్రైవ అమృతత్వం శ్రూయతే యదా సర్వే ప్రముచ్యన్తే కామా యేఽస్య హృది స్థితాః, అథ మర్త్యోఽమృతో భవతి అత్ర బ్రహ్మ సమశ్నుత ఇతి-ఏవం ప్రాప్తే అభిధీయతే 'సమానా చాసృత్యుపక్రమాత్' ఇతి - విదుషో ప్యాసృత్యుపక్రమాత్ ఉత్క్రాన్తి స్సమానా" అని సిద్ధాంతీకరించిరి. పండితులకు, పామరులకు కూడ నాడీ ప్రవేశమునకు ముందు ఉత్క్రాన్తి సమానమే. నాడీప్రవేశసమయమున పామరులకు నూటఒక్కనాడులలో ఏదో ఒకనాడి ద్వారమున ఉత్క్రమణము జరుగవచ్చును. కాని, పండితులకు శిరస్సును భేదించుకొనిపోవు సుషుమ్న అను నాడీవిశేషము ద్వారా ఉత్క్రమణము సిద్ధించుచున్నది. అదే భేదము. మొత్తముమీద ఉత్క్రమణము పండితులకును అనివార్యము అని భగవద్రామానుజుల సిద్ధాంత సారాంశము.

పండితులకు ఉత్క్రాన్తిలేదు అనువారు కాఠకశ్రుతి ప్రమాణముగ చూపుటచే, వీరును ఉత్క్రమణము కలదు

అనుటకు మరొక కారకశ్రుతినే ప్రమాణముగ చూపుచు, పూర్వపక్షులు ఉదాహరించిన శ్రుతిని కాదనకుండ, దానిని కూడ ఈ సిద్ధాంతమునకు అనుకూలముగ వ్యాఖ్యానించి సమన్వయపరచినారు. ఈ సందర్భమున ఆ శ్రుతియందున్న "అత్ర బ్రహ్మ సమశ్నుతే" అనుదానిని సమన్వయించుచు, "ఉపాసన వేలాయాం యో బ్రహ్మానుభవః తద్విషయమి త్యభిప్రాయః" అని వివరించిరి.

ఇచ్చటనే బ్రహ్మమును పొందును అన్నమాటకు ఉపాసన వేళలో కలుగు బ్రహ్మానుభవమే ఇచ్చట ఉద్దేశింపబడినది- అని భగవద్రామానుజులు వ్రాయుటచే సర్వకాల సర్వావస్థల యందును తెంపులేని పరబ్రహ్మానుభవము జీవించియుండగా సాధ్యము కాదనియును పరిమితమైన ఉపాసన వేళలో కలుగు తాత్కాలికానుభూతియే ఆ మంత్రమున ఉద్దేశింపబడినది అనియును భగవద్రామానుజుల అభిప్రాయముగా కొందరు వ్యాఖ్యానించుచున్నారు.

కాని అది సరికాదు అనిపించును.

ఉపాసన వేళ అనియును, కాని వేళ అనియును రెండు వేళలు ఉండవు యోగికి. తొమ్మిదవ అధ్యాయమున "సతతం కీర్తయంతో మాం" అన్న శ్లోకమును వ్యాఖ్యానించుచు "అత్యర్థ మత్ప్రియత్వేన మత్కీర్తన యతన నమస్కారై

ర్త్వా క్షణానుమాత్రేఽప్యాత్మధారణ మలభమానాః షడ్గుణ విశేషవాచీని నామాని శ్రుత్వా పులకాంచిత సర్వాంగాః హృష్ట గద్గదకంఠాః నారాయణ కృష్ణ వాసుదేవ ఇత్యేవ మాదీనినామాని సతతం కీర్తయంతః" అన్న భగవద్రామానుజుల దృష్టిలో అట్టియోగికి ఉపాసన వేళ కానివేళ ఎట్లుండును? పరమపదగతస్థితిలో అనుభూతితక్క ఉపాసన ఉండదు. అందు చేత శరీరగతస్థితిని ఉద్దేశించి వాడినదే ఉపాసన వేళ అన్న పదము. ఫలితార్థము-భగవద్రామానుజుల దృష్టిలో సాధనదశలు, ఉపాసన వేళ అనునవి శరీరగతస్థితిని తెలియజేయుపదములు.

అయితే "తదాపీతేస్సంసార వ్యపదేశాత్" (౪-౨-౮) అన్న సూత్రమును వ్యాఖ్యానించుచు "అపీతి - అప్యయః బ్రహ్మప్రాప్తిః సాచార్చిరాదినా మార్గేణ దేశవిశేషం గత్వా ఇతి వక్ష్యతే. అతిదవస్థాప్రాప్తేః సంసారః - దేహ సంబంధ లక్షణోహ వ్యపదిశ్యతే తస్య 'తావదేవ చిరం యావ న్నవిమోక్ష్యేఽథ సంపత్స్యే' ఇతి. అశ్వఇవ రోమాణి విధూయ పాపం చంద్ర ఇవ రాహోర్ముఖాత్ ప్రముచ్య ధూత్వా శరీర మకృతం కృతాత్మా బ్రహ్మలోక మభిసంభవానీతి" అని వ్రాసిరి.

దీనినిబట్టి వారిభావము మరొకవిధముగ చెప్పవచ్చు ననుటకు వీలులేదు. ఏలయన, ఈ సందర్భమందు చర్చ ముఖ్య ముగ 'విద్వాంసులకు సైతము ఉత్క్రమణము కలదు' అనుటను

సమర్థించుచు సాగినది. ప్రధానాశయము ఉత్క్రమణము కలదో లేదా అనునదే కాని, శరీరగతుడై ఉండగా భగవదనుభవము సంభవమా కాదా అనునది కాదు. 'అతదవస్థాప్రాప్తేస్సంసారః' అనుచోట సంసారమనగా దేహసంబంధము - దేహముతో కూడి ఉండుట. దేహముతో సంబంధము - కూడి ఉండుటవరకు - కాదనినవారెవరు? జీవన్ముక్తి అంగీకరించినవారుమాత్రము ప్రారబ్ధపూర్తివరకు శరీరగతస్థితి అనివార్యమని అంగీకరింపలేదా? కాగా, శరీరమునందు ఉన్నను, ఆ స్పృహ - సంగము - ఉండదు గనుక అది బంధనముగ అనిపించదు. అనిపించకపోవుటే కాదు - అది బంధనముకాదు.

“సూక్ష్మం ప్రమాణతశ్చ తథోపలబ్ధేః (౪-౨-౯) అను తరువాతి సూత్రవ్యాఖ్యానములోకల 'ఇతశ్చ విదుషోఽపి బన్ధో నాత్ర దగ్ధః యతః సూక్ష్మశరీర మనువర్తతే' అనుపంక్తిలోని బంధశబ్దమునకు శరీరముతో కూడి ఉనికి అనియే భావము. పూర్వసూత్ర వ్యాఖ్యలోని 'తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యే అథ సంపత్స్యే' అన్నశ్రుతిలో ప్రాదేశిక పరమపద ప్రాప్తి ఉద్దేశింపబడినదే కాని, భగవదనుభవ జనితానంద ప్రాప్తికాదు.

విద్యాప్రాప్తికి ఫలముగ ఉత్తరపూర్వాఘముల - అనగా ఆగామిసంచితముల - అశ్లేషవినాశము చెప్పి, విద్యా

మాహాత్మ్యముచే నశింపక ప్రారబ్ధమే శరీరస్థితి హేతుభూతముగా ఉండును అని వివరించిరి. సంచితాగాములు బ్రహ్మవిద్యా మాహాత్మ్యముచే నశింపగా, ప్రారబ్ధము అనుభవముచే నశింపగా, ఇక అతనికి పాపము ఎట్లుండును? "అశ్వఇవ రోమాణి విధూయ పాపం, చంద్రఇవ రాహోర్ముఖాత్ప్రముచ్య......" అన్నచోట చెప్పబడిన పాప మెక్కడిది? నిజమునకు అది పాపముకాదు. శరీరముతోడి సంబంధమే అచ్చట పాపముగా నిర్దేశింపబడినది. అట్లే "ఇతరశ్చ విదుషోఽపి బంధో నాత్రదగ్ధః" అన్నచోటకూడ బంధము అనగా సూక్ష్మశరీరముతో కూడిన ఉనికి అనియే అర్థము. అది బంధముకాదా అనిన, సర్వదా, సర్వథా ఆత్మావలోకనశీలుడై ఉండువానికి శరీరస్పృహ ఉండినగదా బంధము! అట్టిస్పృహయే లేనివారికి బంధ మెచ్చట? కాదు- ఇచ్చట 'బంధః' అని వాడబడినది గనుక బంధము అనియే చెప్పవలయును అనినచో, 'సంసారో జితః' - సంసారము జయింపబడినది - అన్నచోట జితప్రాయమని ఏల చెప్పవలయును? ఇట్టి సందర్భములలో భగవద్రామానుజుల యథార్థాభిప్రాయము ఏది అను జిజ్ఞాసతో వ్యవహరింపవలయును. కేవలము రామానుజుల గ్రంథములను పరిశీలించినచో, వారు జీవన్ముక్తి అన్నపదము వాడకపోయినను అట్టి అనుభవముయొక్క ఉనికిని వ్యతిరేకింపలేదనియును, విద్వాంసునికి ఉత్క్రమణమే లేదు అను వాదమును ఖండించు సందర్భమున వచ్చిన ఈచర్చను ఈవిధముగ సమన్వయము చేసికొనవలయునని యును అమృతవాహిని అభిప్రాయము.

అట్టి అనుభవము కలిగినవాడు జన్మరాహిత్యమును, ప్రాదేశిక పరమపదప్రాప్తినికూడ ఇచ్ఛగింపడు. అందుచేతనే కులశేఖరులు "నాస్థాధర్మే......" అన్న శ్లోకములో వరుసగా ధర్మార్థకామములను త్రోసిపుచ్చి, అంతటితో ఆగక "జన్మ జన్మాంతరేఒపి......" అనుటమూలమున జన్మరాహిత్య రూపమును, *అగు ముక్తిని సైతము తిరస్కరించినారు. ఎట్టి అనుభవము కలిగినను, శరీరగతస్థితి బంధనమే అను సిద్ధాంతమే అంగీకరించినచో, కులశేఖరులు బంధనమునే కోరుకొనిరని చెప్పవలయును. అది సరికాదు. భగవదనుగ్రహమువలన ఆ అనుభూతి కలిగిన క్షణమునుండి, ఇక ప్రకృతి ఆతనిని ఏమియు చేయలేదు. అతనికి పతనభయమును లేదు. అనుభవము పరమ పదమునందలి అనుభవమునకు అభిన్నమైనది. ఇక ఈ శరీర ముతో ఉన్నచో, ఇతర చేతనులకు సేవచేయు అవకాశము అధికముగ కలదు - కనుకనే వారు అట్లు సెలవిచ్చిరి.

జీవన్ముక్తులు అన్నపదము భగవద్రామానుజులు ఉప యోగించలేదు. కాని రామానుజుల అవతారమే అని విశ్వసింప బడుచున్న మనవాళమహామునుల ఆస్థానమందలి అష్టదిగ్గ జములలో ఒకరు- ఎఱుంబి అప్పా అనువారు 'విలక్షణమోక్షాధి కారి నిర్ణయము' అను తమ గ్రంథములో జీవన్ముక్తులు అను పదమునుగూడ ప్రయోగించినారు. *

* 'విలక్షణ మోక్షాధికారి నిర్ణయము' యొక్క ఆంధ్రానువాదమునుబట్టి ఇది వ్రాయుచున్నాము. మూల తమిళగ్రంథము చూచుట సందర్భ పడలేదు. - వ్యాఖ్యాత.

* ప్రాదేశిక పరమపద ప్రాప్తిరూపమును

సారాంశముగ ఈ శ్లోకమున 'అభితః' అనుట మూలమున కృష్ణపరమాత్మ దేశకాల అవస్థాది నియమములు లేకయే భగవదనుభవమును ప్రతిపాదించినాడు అని అమృత వాహిని అభిప్రాయము.

శ్లో॥ స్పర్శా న్కృత్వా బహి ర్బాహ్యాన్
చక్షుశ్చై వాంతరే భ్రువోః ।
ప్రాణాపానౌ సమౌ కృత్వా
నాసాభ్యంతర చారిణౌ ॥ ౨౭

శ్లో॥ యతేంద్రియమనోబుద్ధిః
ముని ర్మోక్షపరాయణః ।
విగతేచ్ఛా భయక్రోధః
య స్సదా ముక్త ఏవ సః ॥ ౨౮

ప. వి :—స్పర్శాన్, కృత్వా, బహిః, బాహ్యాన్, చక్షుః, చ, ఏవ, అంతరే, భ్రువోః, ప్రాణపానౌ, సమౌ, కృత్వా, నాసాభ్యంతరచారిణౌ. ౨౭

ప. వి :—యతేంద్రియమనోబుద్ధిః, మునిః, మోక్షపరాయణః, విగతేచ్ఛాభయక్రోధః, యః, సదా, ముక్తః, ఏవ, సః. ౨౮

టీక :—

బాహ్యాన్ = బాహ్యములైన,
స్పర్శాన్ = విషయములను,
బహిరేవకృత్వా = త్రోసిపుచ్చి,
చ = మరియు,
చక్షుః = దృష్టిని,
భ్రువోః అంతరే = భ్రూమధ్యమునందు (నిలిపి),
నాసాభ్యంతరచారిణౌ = ముక్కులో ఆడుచుండెడి,
ప్రాణాపానౌ = ఉచ్ఛ్వాస నిశ్వాసములను,
సమౌకృత్వా = సమముగ చేసి,
యః = ఎవడు,
యతేంద్రియ మనోబుద్ధిః = ఇంద్రియములను, మనస్సును, బుద్ధిని నియమించినవాడో,
విగతేచ్ఛాభయక్రోధః=ఇచ్ఛ, భయము, క్రోధము పూర్తిగ నశించినవాడో,
మోక్షపరాయణః = మోక్షమునందు పూర్ణమైన నిష్ఠ గలిగినవాడో,
సః = అట్టి,
మునిః = ముని,
సదా = ఎల్లప్పుడును,
ముక్తఏవ = ముక్తుడే.

తా. బాహ్యవిషయములను దూరముగ త్రోసిపుచ్చి, దృష్టిని భ్రూమధ్యమందు నిలిపి, ముక్కులో సంచరించు ప్రాణాపానములను - ఉచ్ఛ్వాసనిశ్శ్వాసములను - సమముగచేసి, మనోబుద్ధీంద్రియములను నియమించి, ఆశాభయక్రోధములను పూర్తిగ వశింపజేసికొనినవారు, మోక్షమే ప్రయోజనముగాగల మునులు ఎప్పుడును ముక్తులే. అనగా జీవించియున్నను ముక్తులే అని భావము.

అమృతవాహిని :—

బాహ్యవిషయములను దూరముగ త్రోసిపుచ్చి, దృష్టిని భ్రూమధ్యమందు నిలిపి, ప్రాణాపానగతులను సమము చేయుట మునియొక్క లక్షణముగా చెప్పుచున్నాడు పరమాత్మ. ఇందు బాహ్యవిషయములు అనగా బాహ్య విషయాభిలాష, ప్రాకృతములైన శబ్ద స్పర్శ రూప రస గంధములు అనుభవించుటకై పడు తపన. దానిని ముందుగ దూరముగ త్రోసిపుచ్చవలయును. ఆనందానుభవముకొరకై కదా ఈ విషయములను కోరుట ! అట్టి ఆనందానుభవము వీనివలన సాధ్యముకాకపోవుటేకాక, ఇవి ఆనందానుభవమునకు ఆటంకములుకూడ అను సత్యమును మననము చేసికొనుట మూలమున ఇది సాధింపవచ్చును.

ఇక రెండవది దృష్టిని భ్రూమధ్యమందు నిలుపుట. భ్రూమధ్యము ప్రణవస్థానము. మంత్రజప సమయమునను, ధ్యానసమయమునను దృష్టి భ్రూమధ్యమందు నిలుపుట

యోగసంప్రదాయము. అంతేకాక, భ్రూమధ్యస్థానీయమైన ప్రణవమునందే సదా దృష్టిని నిలిపియుంచుటగాకూడ దీనిని సమన్వయించుకొనినచో, ఏకకాలికముగాకాక సార్వకాలికముగాకూడ చెప్పవచ్చును. ఇచ్చట దృష్టిని ఉద్దేశించి 'చక్షుః' అని ప్రయోగించుటచే, పై బాహ్యావిషయములు అన్నప్పుడు జ్ఞానేంద్రియ విషయములు వచ్చినవి గనుక కర్మేంద్రియములన్నింటికి ఇది ఉపలక్షముగ చెప్పి, కర్మేంద్రియ వ్యాపారములన్నియు భగవత్సేవారూపముగ రూపొందించుకొనవలసినదిగా హెచ్చరించినాడు పరమాత్మ అనియు చెప్పుకొనవచ్చును. ప్రాణాపానములను సమముచేయుట తరువాతి లక్షణము. "ప్రాణోఽపాన స్సమానశ్చోదాన వ్యానౌచ వాయవః" అని అయిదువాయువులు. శరీరమునందు వాని స్థానములు నిర్దేశింపబడియే ఉన్నవి. "హృది ప్రాణో గుదేఽపాన స్సమానో నాభి సంస్థితః ఉదానః కంఠదేశస్థో వ్యాన స్సర్వశరీరగః" అని. అధోముఖముగ మలములను బయటకు వెడలించువాయువును అపానము అందురు. కాని, ఇచ్చట "నాసాభ్యంతరచారిణౌ" అన్న విశేషణము ప్రయోగించుటచే ఇచ్చట ప్రాణాపానములు అనగా ఉచ్ఛ్వాసనిశ్శ్వాసములు అనిచెప్పవలయును.

ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములు సమముగా - సమగతి కలవిగా - చేయవలయును. ఇది ప్రాణాయామసాధనమునకు లక్ష్యమైనది. సరియగు గురువు లభించి సక్రమరీతిలో సాధన

జరిగిననేతప్ప, ప్రాణాయామసాధన ప్రమాదభూయిష్ఠము. ఇందుకు మరొకరీతి కలదు. ఏదైన సమాక్షరములు కల నామమును తీసికొని, మనస్సున అది ఉచ్చరించుకొనుచు సగభాగమున ఉచ్ఛ్వాసము, సగభాగమున నిశ్శ్వాసము చొప్పున అభ్యాసము చేసినచో ఇది సులభసాధ్యము. కొంతకాలమునకు సహజముగనే ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములు సమగతి కలవిగ ఏర్పడును. అజపామంత్రమని ప్రసిద్ధిపొందిన 'హంసః' అనునది క్రమగతిలో 'హంసోహంసోహంసో' అనురీతిలో ఉచ్ఛ్వాస నిశ్శ్వాసలను కలిపి సాధనచేసి, సహజసమస్థితిని సాధించుట ప్రాచీనులు సూచించుమార్గము. అట్లే, 'రామ' మొదలైన నామములను ఉపయోగింపవచ్చును. ఇది సాధించినవాడు 'యతేంద్రియమనోబుద్ధి' కాగలడు. 'విగతేచ్ఛాభయక్రోధుడు' కాగలడు. మోక్షపరాయణుడైన ఇట్టి ముని ఎల్లప్పుడును ముక్తుడే.

బాహ్యవిషయానుభవరతిని దూరముగ త్రోసిపుచ్చుటచే ఇంద్రియజయము సిద్ధము. దృష్టిని భ్రూమధ్యమందు నిలుపుటచే, అనగా, భ్రూమధ్యస్థానీయమైన ప్రణవమందు మాత్రమే దృష్టికలిగియుండుటచే మరొకదానివైపు పోవుటకు అవకాశమే కలుగదుకదా మనస్సుకు! ఆ విధముగ మనోజయము సిద్ధించును. ప్రాణాపానములను, ఉచ్ఛ్వాస నిశ్శ్వాస

ములను - నామజపముద్వారా సమగతి కలవిగా చేయుటచే ఆ విధముగ జరుగు అవిరత నామజపముచేతను, సమగతికల ఉచ్ఛ్వాస నిశ్వాసములచేతను - అనగా సహజసిద్ధమైన ప్రాణాయామముచేతను - బుద్ధి నిర్మలమై శుద్ధసత్త్వమగును. ఆ విధముగ బుద్ధిజయము సిద్ధించును. అట్టివాడు 'యతేంద్రియ మనోబుద్ధి'. అట్టివాడు 'విగతేచ్ఛాభయక్రోధుడు' కూడ.

క్రోధమునకు మూలము తన ప్రయోజనమునకు భంగము కలుగుచున్నదను భయము. ఒక వస్తువునందో, అనుభవమునందో తీవ్రమైన అభిరతి ఉన్ననాడే, అది పోవునో, దానికి భంగము కలుగునో అను భయము సంభవించును. అనగా, భయమునకు మూలము ఇచ్ఛ. బాహ్యవిషయానుభవరతి నశించిననాడు ఇక ఇచ్ఛకు తావేది? ఇచ్ఛలేనినాడు భయము లేదు. భయము లేనివానికి క్రోధమునకు అవకాశమేలేదు. అందుచే అన్నింటికి మూలముగ బాహ్యవిషయానుభవరతిని దూరముగ త్రోసిపుచ్చవలయును అని హెచ్చరించినాడు పరమాత్మ.

ఇన్ని సాధించినవాడు మోక్షపరాయణుడు. మోక్షమందే నిష్ఠగలవాడు. పరాయణుడు అనగా నిష్ఠకలవాడు - అనగా, అది సాధించనిదే నిలువలేనివాడు, ప్రాణములు నిలువలేనివాడు అని చెప్పవలయును. ముముక్షువు అను పదము

మోక్షకాంక్ష ప్రారంభమైనవారి కందకిని వాడబడుచున్నను అది గౌణము. ముఖ్యార్థమున మాత్రము భగవదనుభవరూప మోక్షము పొందితీరవలయుననెడి పరమార్తితో విలంబనము సహింపలేనిస్థితిలో - ఆ అనుభవము పొందక ప్రాణములు నిలుపలేని స్థితిలో - ఉన్నవాడే ముముక్షువు - మోక్షపరాయణుడు. వానినే ముని అనవలయును. ముని అనగా ఆత్మావలోకనశీలుడు.అట్టివాడు ఎప్పుడు ఎక్కడ ఎట్లుఉన్నను ముక్తుడే. సర్వమునందును బాహ్యాభ్యంతరములలో సర్వదా పరమాత్మనే దర్శించుచు అనుభవించుచున్న అతడు ముక్తుడు కాక బద్ధుడెట్లగును ?

శ్లో॥ భోక్తారం యజ్ఞతపసాం
సర్వలోకమహేశ్వరమ్।
సుహృదం సర్వభూతానాం
జ్ఞాత్వా మాం శాంతి మృచ్ఛతి ॥ —౨౯

ప. వి :— భోక్తారం, యజ్ఞతపసాం, సర్వలోకమహేశ్వరం, సుహృదం, సర్వభూతానాం, జ్ఞాత్వా, మాం, శాంతిం, ఋచ్ఛతి.

టీక :—

మాం = నన్ను,
యజ్ఞతపసాం = యజ్ఞములకు, తపస్సులకు,
భోక్తారం = భోక్తగా,

సర్వలోక మహేశ్వరం = సర్వలోకములకు, దేవతో
లకు ప్రభువుగా,

సర్వభూతానాం = సర్వజీవులకు,
సుహృదం = మిత్రునిగా, మేలుకోరువానినిగా,
జ్ఞాత్వా = తెలిసికొని,
శాంతిం = శాంతిని,
ఋచ్ఛతి = పొందుచున్నాడు.

తా. సమస్తమైన యజ్ఞములకు, తపస్సులకు నేనే భోక్తను. సమస్తలోకములకు, దేవతలకు నేనే ప్రభుడను. సమస్తప్రాణులకు నేనే మేలుచేయువాడను. అట్టి నన్ను తెలిసికొనినవాడు నా అనుభవరూపమగు శాంతిని పొందుచున్నాడు.

అ మృ త వా హి ని :—

సమస్త యజ్ఞములకును, తపస్సులకును నేనే భోక్తను అని నిష్కర్షగ చెప్పుచున్నాడు పరమాత్మ. లోకమున అనేక ప్రయోజనములుకోరి యజ్ఞయాగాదులు చేయబడుచున్నవి. ఒక్కొక్క యజ్ఞమున ఒక్కొక్క దేవత ప్రధానముగ అర్చింప బడుచున్నట్లు తోచుచున్నది. అట్లు అర్చించుటచే ఆ యా దేవతల అధికారపరిధులకు లోబడిన ఫలములను మాత్రమే యజమాని పొందుచున్నాడు. నిజమునకు అన్ని యజ్ఞములకు భోక్త పరమాత్మయే. అంతేకాక, స్వార్థదృష్టితో కాక పదిమందికి ఉపకరించు ఏ సత్కార్యము తలపెట్టినను అది యజ్ఞమనియే చెప్పవలయును. అట్టి సత్కార్యముల ఫలము ప్రత్యక్షముగ తోడివారు అనుభవించుచున్నట్లు కనబడినను, అది

అరూపముగ అనుభవించువాడు పరమాత్మయే. అందుచే, సమస్త యజ్ఞములకును తానే భోక్తనని నిర్ధారించి చెప్పినాడు పరమాత్మ. సర్వతపస్సులకును - సర్వోపాసనలకును - ఆయనయే భోక్త. ఎప్పుడు ఎక్కడ ఎవరు ఏ రూపనామములను అర్చించినను, ఉపాసించినను, ఆ అర్చనలు, ఉపాసనలు చెందునది ఆయనకే. ఎందుచేతఅనగా-సర్వలోకములకు, సర్వదేవతలకు ప్రభువు ఆ పరమాత్మయే. దయాసముద్రుడు కనుక సర్వులకు ఆయన సుహృత్తు - మిత్రుడు - మేలుచేయువాడు. పరమాత్మను గూర్చిన ఈ జ్ఞానము కలిగినవాడు శాంతిని - భగవదనుభవరూపముక్తిని - పొందుచున్నాడు.

ఇచ్చట 'మాం' 'నన్ను' అని చెప్పుటచే - సగుణోపాసన చేసినను, నిర్గుణోపాసన చేసినను, చివరకు పొందునది సగుణసాకారతత్త్వమగు తననే అని సిద్ధాంతీకరించుచు పరమాత్మ ఈ అధ్యాయమును ముగించుచున్నాడు.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే కర్మసన్న్యాస
యోగోనామ పంచమోఽధ్యాయః

ఇతి శ్రీపరమహంస పరివ్రాజకాచార్యాణాం
శ్రీ యదుగిరి యతిరాజ సంపత్కుమార రామానుజ
శిష్యేన సీతారామయతినా విరచితే అమృతవాహినీ
నామక గీతాభాష్యే కర్మసన్న్యాసయోగోనామ
పంచమోఽధ్యాయః

TIRU